
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 1 మార్చి 2024 | 5





ఎప్పుడిస్తారో..

- అటు ఆశావహులు, ఇటు పార్టీ కేడర్‌లోనూ టెన్షన్
- ఇంకా టీడీపీలో నాలుగుచోట్ల అదే ఉత్కంఠ
- గోరంట్ల, దుర్గేష్ టికెట్లు ఇంకా అధికారిక ప్రకటించని వైనం
- నిడదవోలు, కొవ్వూరు సీనియర్లలో ఆందోళన
- వైసీపీలో అంతా గజిబిజి వ్యవహారం



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మార్చి నెల రెండోవారంలో వచ్చే అవకాశం ఉంది. కానీ ఇప్పటిదాకా ప్రధాన పార్టీలు ఇంకా అభ్యర్థులను పూర్తి స్థాయిలో ఖరారుచేయలేదు. దీంతో ఆశావహులతోపాటు ఆయా ప్రాంతాల కార్యకర్తలు, అభిమానుల్లో కూడా ఆందోళన వెంటాడుతోంది. ఇప్పటివరకూ అధికారికంగా టీడీపీ నుంచి రాజమహేంద్రవరం సిటీ, అనపర్తి స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేయగా, జనసేన నుంచి రాజానగరం అభ్యర్థిని ఖరారుచేసిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు సీట్లకు టీడీపీ -జనసేన పొత్తు ఓ బంధాన్ని ఏర్పాటుచేసింది. రాజమహేంద్రవరం రూరల్ సీటు కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన



కందుల దుర్గేష్ (జనసేన)



గోరంట్ల (తెలుగుదేశం)

నేత కందుల దుర్గేష్ ఆశించగా.. గోరంట్లకు ఖాయంచేసి, పొత్తులో భాగంగా దుర్గేష్‌కు నిడదవోలు స్థానం ఖాయంచేసినట్టు ఆయా పార్టీల అధిష్ఠానాలు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ ఇంకా అధికారికంగా ప్రకటించకపోవడంతో వీరిద్దరితోపాటు పార్టీ కేడర్‌లోనూ టెన్షన్ వీడలేదు. నిడదవోలుకు దుర్గేష్ వసున్నారనే సమాచారంతో అక్కడ టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వర్గంలో ఆందోళన మొదలైంది. శేషారావుకే సీటివ్వాలని ఆయన అనుచరులు డిమాండ్ చేస్తున్నారు. అక్కడ టికెట్ ఆశించిన మరో సీనియర్ నేత కుందుల సత్యనారాయణ మాత్రం ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపిస్తామని, చంద్రబాబును సీఎం చేయడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే శేషారావు, కుందుల సత్యనారాయణ కూడా సీనియర్ నేతలే. అక్కడ వారి భవిష్యత్ ఏంటనేది అధిష్ఠానం చెప్పే అవకాశం ఉంది. కానీ ఈలోపు టెన్షన్.. టెన్షన్. ప్రతీ కార్యకర్తలోనూ టెన్షన్ పెరిగిపోతోంది. ఇక కొవ్వూరులో ఇంకా అభ్యర్థి ఎవరనేది తేలలేదు. తనదే టికెట్ అని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ చెబుతుండగా, అక్కడ ఓ ముఖ్యవర్గంతో ఆయనకు అభిప్రాయ బేధాలు ఉండడం వల్ల ఇంకా స్పష్టత లేదు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఓ ముఖ్యవర్గం మద్దతు ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ కూడా నేతల్లో టెన్షన్ ఉండగా.. కార్యకర్తలు, పార్టీ అభిమానుల్లో అయోమయం నెలకొంది. గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు పోటీ చేస్తారని రెండేళ్ల ముందు నుంచే పార్టీ అధినేతతోపాటు, పలువురు పార్టీ సీనియర్లు కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయనకు మొదటి జాబితాలోనే చోటు లభిస్తుందని అందరూ భావించారు. కానీ మొదటి జాబితాలో పేరు లేదు. నల్లజర్లకు చెందిన జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు.. వెంకట్రాజును వ్యతిరేకిస్తున్నారు. ఆయన మొదట ముప్పిడి వెంకటేశ్వరరావుకు మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం మౌనం వహించినట్టు చెబుతున్నారు. సీనియర్‌గా ముప్పిడిని గౌరవిస్తూనే వెంకట్రాజును అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. కానీ ఆలస్యమవుతుండడంతో కేడర్‌లో టెన్షన్ పెరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో పూర్తి స్థాయిలో టికెట్లు రాకపోయినా ప్రచారం జరుగుతోంది. కానీ అధికారికంగా అభ్యర్థిగా ఓటు అడగడం వేరు. దానికోసం అంతా టెన్షన్ పడుతున్నారు.

రాజమహేంద్రవరంలో రసవత్తరం

రాజమహేంద్రవరం రాజకీయం రసవత్తరంగా మారింది. రాజకీయ హీట్ పెరిగింది. ఈసారి అన్ని సామాజిక వర్గాల ఓట్లు ప్రధానంగానే భావిస్తున్నారు. దీంతో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలోకి వలసలు పెరిగాయి. రాజమహేంద్రవరం అర్బన్‌లో సమీకరణాలు వేగవంతంగా మారుతున్నాయి. ఇటీవల ఏవీ అప్పారావు రోడ్డు నుంచి శ్రీరామపురం వెళ్లే దారిలోని ఓ రాజుగారి గెస్ట్‌హౌస్ క్షత్రియ ప్రముఖుల సమావేశం జరిగింది. అర్బన్‌లో టీడీపీకి మద్దతుగా ఉండాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇక ఇటీవల శెట్టిబలిజ వర్గానికి చెందిన బలమైన నేత గుత్తుల నారాయణ, బ్రాహ్మణవర్గానికి చెందిన నిముష కవి, ప్రదీప్‌లతోపాటు పలువురు టీడీపీలో చేరారు. వైసీపీ నేత, ఉమా మార్కేండేయస్వామి దేవస్థానం ఛైర్మన్ ఇన్నమూరి దీపక్ పార్టీలో చేరుతున్నారు. వైసీపీకి రాజీనామా చేశారు. 25వ డివిజన్‌లోని కాపు వర్గానికి చెందిన ముద్రగడ జయరాం, అర్లపల్లి బాబూరావు నాయకత్వంలో సుమారు 150 మంది చేరారు. తూర్పుకాపు వర్గానికి చెందిన ప్రముఖుడు రుంకాని వెంకటేశ్వరరావు కుమారుడు, అజాద్‌చౌక్‌కు చెందిన యాదవ వర్గానికి చెందిన శేఖర్ తన అనుచరులతో టీడీపీలో చేరారు. సుమారు 50 మంది ముస్లిం నాయకులు కూడా టీడీపీ కండువా కప్పుకున్నారు. 47వ డివిజన్‌కు చెందిన 75 మంది ఎస్సీ నాయకులు కూడా పార్టీలో చేరారు. ఇంకా వివిధ సామాజిక వర్గాలకు చెందిన పలువురు పార్టీలో చేరనున్నట్టు చెబుతున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసుకు నగరంలో ఆదరణ పెరుగుతోంది. తన పర్యటనలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నారు. మరోపక్క జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ కూడా ఆదిరెడ్డికి అండగా నిలిచి ప్రచారం చేస్తున్నారు. నగరంలోని టీడీపీ సీనియర్ నేత, గుడా తొలి ఛైర్మన్ గన్ని కృష్ణ అండగా నిలిచారు. కాగా టీడీపీ ఎంపీ అభ్యర్థి విషయం ఇంకా తేలలేదు.

వైసీపీలో అంతా అయోమయం!

- నేతల ప్రకటనలతో అభ్యర్థిగా ఉంటామో లేదో తెలియని వైనం
- అధికారిక ప్రకటన వచ్చే వరకూ సమన్వయకర్తలకు టెన్షనే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు స్థానాలకు సమన్వయకర్తలను వైసీపీ ప్రకటించింది. అదీ గజిబిజి వ్యవహారంగానే నలుగుతోంది. గోపాలపురం ఇన్చార్జిగా తానేటి వనిత, కొవ్వూరు ఇన్చార్జిగా తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం సిటీ సమన్వయకర్తగా మార్గాని భరత్‌రామ్, రూరల్ సమన్వయకర్తగా మంత్రి వేణును ప్రకటించారు. కొవ్వూరు నుంచి హోం మంత్రి తానేటి వనితను గోపాలపురం పంపించారు. అక్కడున్న తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు. అయితే తాను కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే గోపాలపురంలో తనకు ఎవరు ఓటేస్తారంటూ హోంమంత్రి తన ఆంతరంగికుల వద్ద వాపోతుండగా.. కొవ్వూరు తీసుకొచ్చిన గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావులోనూ అదే అసహనం ఉందని చెబుతున్నారు. ఈ పరిణామాలతో వనిత సామాజిక వర్గం నాయకులు అయోమయంలో ఉన్నారు. కొవ్వూరులో వారి ప్రాబల్యం నెమ్మదించిందనే వార్తలు వస్తున్నాయి. అలాగే గోపాలపురంలోనూ తలారి వర్గం ప్రాబవం తగ్గిందని తెలుస్తోంది. రాజానగరం విషయంలో గందరగోళం నడుస్తూనే ఉంది. జక్కంపూడి కుటుంబానికి ఫ్యామిలీ ప్యాకేజీ ఉంటుందా? లేక రాజాను కూడా బదిలీ చేస్తారా? అనే మీమాంశ నడుస్తోంది. జగన్ ఇప్పటి వరకూ విడుదల చేసిన జాబితాల్లో రాజానగరం స్థానంపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. డాక్టర్ గూడూరిని ఎంపీ భరత్ తన వ్యూహంలో భాగంగా పార్టీలోకి తీసుకొచ్చారనే వాదన ఉంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నా ముందు నుంచీ భరత్ రాజమహేంద్రవరం సిటీపైనే కన్నేశారు. వాస్తవానికి గూడూరిని పార్టీ కార్యక్రమాల నిర్వహణ ఖర్చుల కోసం తీసుకొచ్చారనే విమర్శలు గతంలో నుంచే పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇప్పుడు గూడూరిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వైసీపీకి ఆర్థికబలం చేకూరిందని కొందరు చెబుతున్నారు. మరోవైపు బలమైన సామాజికవర్గానికి చెంది, పార్టీని నమ్ముకొని ఉన్న డాక్టర్ అనసూరి పద్మలతకు ఆశజూపి మోసం చేశారనే చర్చ పార్టీ వర్గాల్లో నలుగుతోంది. ముందు నుంచీ ప్రజల్లో ఉంటూ ఎంపీ సీటు తనదేనని అనుకొన్న తరుణంలో గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చి ఆ మహిళ కంట నీళ్లు పెట్టించారనే విమర్శలున్నాయి. ఇక వైసీపీ అతి ముఖ్యుల్లో ఒకరైన వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలు ఆ పార్టీ నాయకులను బిత్తరపోయేలా చేశాయి. ఏడు జాబితాలూ మారొచ్చు అనే సంకేతాలను వైవీ సుబ్బారెడ్డి తన వ్యాఖ్యల ద్వారా స్పష్టంచేశారు. "ఇప్పటివరకూ మేం మార్పులు, చేర్పులు చేసినా వాళ్లు 'సమన్వయకర్తలే'.. ఒక్కసారి లిస్ట్ అనౌన్స్ చేశాక తప్పకుండా అభ్యర్థులుగా మారతారు. అప్పటివరకూ ఎవరినైనాసరే సమన్వయకర్తలుగానే నియమించడం జరిగింది. ఫైనల్ లిస్ట్ వచ్చిన తర్వాతే అదే కన్ఫర్మేషన్ అవుతుంది" అంటూ మడమ తిప్పేశారు. దీంతో ఎవరు సీటు కింద నీరు చేరిందో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తేగాని తేలే అవకాశం లేదు. మరోవైపు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలతో కొందరిలో ఆశ మళ్లీ చిగురిస్తోంది. సీటు కోసం మళ్లీ 'ప్రయత్నాలు' మొదలు పెట్టారని తెలుస్తోంది. రాజమహేంద్రవరం రూరల్‌లో చందన నాగేశ్వర్ ముందు నుంచీ వైసీపీలో చురుగ్గా ఉన్నారు. తనకంటూ ఓ కేడర్ ఏర్పాటుచేసుకున్నారు. ఆయనను పక్కన పెట్టేసి వేణును తీసుకొచ్చారు. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. రాజమహేంద్రవరం ఎంపీ సీటు తనదేనని అనసూరి పద్మలత ముందు నుంచీ ఆశ పెట్టుకున్నారు. అయితే పార్టీలో చురుగ్గా తిరుగుతున్న ఆమెను కాదని చివరికి అదే సామాజిక వర్గానికి చెందిన గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చారు. ఎమ్మెల్యేగా లేదా ఎంపీగా పోటీ చేయడానికి అనసూరి పద్మలతను ఒప్పించాల్సిందిగా రెండేళ్ల క్రితమే వైవీ సుబ్బారెడ్డి ఓ ముఖ్య నాయకుడితో చెప్పారని సమాచారం. ఆ విధంగా ఆమెకు వైసీపీ పెద్దలు చుక్కలు చూపించారు. అంతా అనుకున్నట్టే జరుగుతోందని వైసీపీ పెద్దలను నమ్మిన అనసూరికి నిరాశే మిగిలింది. వైసీపీ పెద్దలు చాపకింద నీరులా చేసిన మోసాన్ని తట్టుకోలేక కన్నీరుపెట్టారు. మార్పులు చేర్పుల ప్రకటనతో మరోసారి భంగపడిన వారంతా కొత్త ఆశలతో తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారని తెలుస్తోంది.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 29 : సీఎం జగన్మోహనరెడ్డి రాష్ట్రంలోని లక్షలాదిమంది నిర్మాణ కార్మికుల భవిష్యత్తుకు చెందిన సంక్షేమబోర్డుకు తూట్లు పొడిచారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను దేశవ్యాపితంగా ఒకేవిధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంగా జగన్ వచ్చిన తర్వాత సంక్షేమ బోర్డు నిర్వీర్యమైందని, దీన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ద్వారా అందాల్సిన ప్రభుత్వ ఆర్థిక సాయం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.5 కోట్ల క్లెయిమ్స్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.శ్రీనివాస్, చింతలపూడి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు
- కంట్రోల్ రూం నెం.9492226232

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లూ చేశామని ఇంటర్‌బోర్డు జోన్ 1, 2 ఆర్జేడీ శారద తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయని, ఆలస్యంగా విద్యార్థులకు అనుమతి ఉండదన్నారు. జనరల్ విభాగంలో మొదటి ఏడాది 19,406, రెండో ఏడాది 18,166, ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది కలిపి 3,810 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరశింహం పేర్కొన్నారు. తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయం, నిరంతర విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 52 సెంటర్లకు 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 6 అడిషనల్ డీవోలు, 11 మంది కస్టోడియన్లు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 2 సిటింగ్ స్క్వాడ్స్‌ని నియమించామని చెప్పారు. జిల్లాలో ఒక సున్నితమైన, 600 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్నవి 6 సెంటర్లు ఉన్నాయన్నారు. పరీక్షలకు సంబంధించి సమాచారం కోసం కంట్రోల్ రూం నెంబర్లు 0883 2473430, 9492226232లో సంప్రదించాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని పేర్కొన్నారు.

ఒత్తిడి వద్దు.. ప్రశాంతంగా రాయండి!



జవాబులతోపాటు సమయమూ చాలా ముఖ్యమే

పరీక్షల వేళ ఒత్తిడిని అస్సలు దరిచేయనీయకూడదు. పరీక్షలకు ఇంటి వద్ద నుంచి బయలుదేరడం దగ్గర నుంచీ పరీక్ష రాసి బయటకు వచ్చేవరకూ మానసికంగా భయపడకూడదు. ఒత్తిడి పడడం వల్ల తెలిసిన సమాధానాలను కూడా మరిచిపోయే ప్రమాదం ఉంది. పరీక్ష పత్రం అందుకొన్న తర్వాత ప్రశాంతంగా ఓ ఐదు నిమిషాలు చూసుకొని బాగా సమాధానాలు తెలిసిన ప్రశ్నలతో మొదలుపెట్టాలి. తర్వాత కొంత తెలిసినవి, చివరిలో రావనుకొని వదిలేసిన ప్రశ్నల సమాధానాల కోసం ప్రయత్నించాలి. జవాబులు ఎంత అవసరమో అంతే రాస్తే సమయం కలిసి వస్తుంది. బాగా తెలుసునని రాసుకుంటూపోతే సమయం వృథా అవుతుంది. అందువల్ల సమయాన్ని అంచనా వేసుకుంటూ జవాబులు రాసుకోవాలి. ఈ క్రమంలో జవాబు పత్రాలపై ప్రశ్నల నంబర్లను వేయడంలో జాగ్రత్త వహించాలి. జవాబు పత్రాలపై ఇన్విజిలేటర్ల సూచనలను పాటిస్తూ హాల్ టికెట్ నంబరు తదితరాలు నింపాలి. మరుసటిరోజు పరీక్షలకు అవసరమైన వాటిని.. అంటే స్కేలు, పెన్సిలు, పెన్నులు, డయాగ్రం వేసే వస్తువులు, హాల్ టికెట్‌లను ఒకచోట పెట్టుకుంటే పరీక్షకు బయలుదేరే సమయంలో హైరానా పడాల్సిన అవసరం ఉండదు. పరీక్ష జరుగుతున్న రోజుల్లో సాత్వికాహారం తీసుకోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు ప్రశాంతంగా ఉండే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలి. పరీక్ష రోజుల్లో సరిపడా నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోతే ఆ ప్రభావం పరీక్షపై పడుతుంది. అందువల్ల రివ్యూ చేసుకున్నా సమయానికి నిద్రపోవాలి. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. అంటే 8గంటలకల్లా పరీక్ష కేంద్రం వద్ద ఉండేలా ఇంటి నుంచి బయలుదేరాలి.

- **సామాజిక బాధ్యతను గుర్తెరిగి..**

పరీక్షలకు బయలుదేరే విద్యార్థులు తారసపడితే.. వారికి అవసరమైతే ఆటోవాలాలు ఇతర వాహనదారులు ఆ విద్యార్థులను పరీక్ష కేంద్రాల వద్దకు చేర్చడం సామాజిక బాధ్యతగా గుర్తెరగాలి. ఒక్కోసారి బస్సులు ఆలస్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అలాంటి వాళ్లను వాహనదారులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు సకాలంలో తీసుకువెళ్లాలి.



చట్టంతో విభేదించిన బాలలతో మాట్లాడుతున్న ప్రత్యూష

చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష


రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): చెడు స్నేహాల వల్ల అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, జీవితాలు సమస్యల్లో చిక్కుకుంటాయని.. అందువల్ల వాటికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ బాలల పర్యవేక్షణ గృహాన్ని పరిశీలించారు. చట్టంతో విభేదించిన పిల్లలతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. చెడు పనులు చేయకపోయినా అలాంటి పనులు చేసే వాళ్లతో ఉన్నవారికి కూడా ప్రతికూల పరిణామాలు వర్తిస్తాయని హితబోధ చేశారు. ఉచితంగా న్యాయవాది సేవలను పొందడం వారి హక్కు అని తెలిపారు.



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న వెంకటరత్నం స్వామి

ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీగా వెంకటరత్నం బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీగా టి.వెంకటరత్నంస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కాగా.. విజయవాడలోని ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలో నియమితులయ్యారు.





బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో లబ్ధిదారుడి పేరుతో తయారుచేసిన పట్టా.. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం సేకరించిన మొత్తం 58 ఎకరాల్లో ఒక రైతుకు చెందిన భూమి

అనపర్తిలో వైసీపీ పట్టాల తాయిలం!

- ఎన్నికల వేళ హడావుడిగా లబ్ధిదారులకు పట్టాలు సిద్ధం
- రైతులకు భూసేకరణ సొమ్ము చెల్లించకుండానే పట్టాల తయారీ
- మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ఆందోళనలతో రాత్రికి రాత్రే రైతుల ఖాతాల్లో సొమ్ములు
- ఇంకా బిక్కవోలు మండలం కాపవరంలో ఒక్కపైసా జమ లేదు

అనపర్తి, ఫిబ్రవరి 29: ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు అందించేందుకు భూసేకరణ చేసి ఆయా రైతులకు సొమ్ములు చెల్లించకుండా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా పట్టాల తయారీ ప్రక్రియపై అనపర్తిలో గత నాలుగు రోజులుగా కలకలం రేగుతోంది. అనపర్తి మండలంలోని 11 గ్రామాల లబ్ధిదారుల జాబితాను 2019లో 90 రోజుల వ్యవధిలో ఇళ్ల స్థలాల పథకంలో భాగంగా ఎంపిక చేశారు. ఈ జాబితాలో 5,409 మంది అర్హులను గుర్తించారు. అప్పటికే 2003లో అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి అనపర్తి శివారు కొత్తూరులో భూసేకరణ ద్వారా సేకరించిన 38 ఎకరాల భూమి, లక్ష్మీనరసాపురంలో కొద్ది భూమి అందుబాటులో ఉంది. దీనికితోడు వైసీపీ ప్రభుత్వం దుప్పలపూడి గ్రామంలో 18 ఎకరాల భూమిని సేకరించింది. వీటిలో అర్హుల జాబితాలో ఉన్న 2,350 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మిగిలిన 3,059 మందికి పట్టాలు పంపిణీ చేయలేకపోయారు. దీంతో తమకు ఇంటిస్థలం రాలేదంటూ అధికార పార్టీ నేతలపై ప్రజల నుంచి ఒత్తిడి పెరిగింది. రెండేళ్ల కిందట బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో గ్రాసిమ్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం జగన్‌కి బిక్కవోలు, అనపర్తి మండలాల్లో ఆరు వేల మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉందని, దీనికి సుమారు 200 ఎకరాల భూమి అవసరమని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వివరించగా, అదే వేదికపై ముఖ్య మంత్రి భూసేకరణకు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో భూసేకరణ ప్రక్రియ ప్రారంభించి బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో 58 ఎకరాల భూమిని, అనపర్తి మండలం రామవరం, కుతుకులూరు, పులగుర్త గ్రామాల్లో సుమారు 30 ఎకరాల భూమిని సేకరించి రైతుల నుంచి పత్రాలు తీసుకున్నారు. ఇదంతా జరిగి ఏడాదిన్నర గడిచిపోవడమే కాకుండా ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు కనిపించకుండాపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, రైతుల ఖాతాల్లో సొమ్ములు నేడో రేపో పడిపోతాయంటూ చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు సొమ్ములు చెల్లించకుండానే వారి భూముల సర్వే నెంబర్లతో ప్లాన్ తయారుచేసి పట్టాల తయారీ ప్రక్రియను ప్రారంభించారు. ఇదంతా తహశీల్దార్ కార్యాలయంలో బాహాటంగా జరుగుతుండడంతో అసలు రైతులకు డబ్బులు వస్తాయా లేక ప్రభుత్వం మారితే తమ భవిష్యత్ ఏమిటన్న ప్రశ్నలతో రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గత శనివారం అక్కడకు చేరుకుని డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను నిలదీశారు. రైతులకు సొమ్ములు చెల్లించకుండా ప్రభుత్వం పొజిషన్ తీసుకోకుండా వారి సర్వే నెంబర్లతో పట్టాలు ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. ఇవి డమ్మీ పట్టాలంటూ అక్కడే నేలపై బైఠాయించి నల్లమిల్లి ఆందోళన చేశారు. గత సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ప్రశ్నించడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. తర్వాత రామకృష్ణారెడ్డి నేరుగా వెలగపూడిలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు కూడా డమ్మీ పట్టాల వ్యవహారంపై ఫిర్యాదుచేశారు. అలాగే అనపర్తిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి



పట్టాలతో తహశీల్దార్ కార్యాలయంలో నిరసన దృశ్యం

పట్టాల డమ్మీ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. డమ్మీ పట్టాల తయారీ వ్యవహారంపై తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లిన రామకృష్ణారెడ్డి సహా 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నాలుగైదు రోజులుగా రైతులకు సొమ్ములు చెల్లించకుండా డమ్మీ పట్టాలు తయారు చేస్తున్నారంటూ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేస్తున్న పోరాటానికి ఫలితంగా మొన్న మంగళవారం రాత్రి అనపర్తి మండలంలోని రామవరం, కుతుకులూరు, పులగుర్త గ్రామాలకు చెందిన 53 మంది రైతుల ఖాతాల్లో భూములకు చెందిన సొమ్ములను ప్రభుత్వం జమచేసింది. దీంతో బాధిత రైతులు ఆనందం వ్యక్తంచేశారు. అయితే అనపర్తి లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకు కాపవరంలో సేకరించిన 58 ఎకరాల భూమికి రూపాయి కూడా జమకాకపోవడంతో రైతుల్లో ఆందోళన కొనసాగుతూనే ఉంది.

ఎన్నికల ఖర్చు విషయంలో మార్గదర్శకాలు పాటించేటట్టు చూడాలి

రాజకీయ పార్టీలు, అభ్యర్థుల మార్గదర్శకాలు, నియమావళిని కచ్చితంగా పాటించాలి

ఎన్నికల వ్యయ పర్యవేక్షణాధికారుల శిక్షణా తరగతుల్లో జేసీ ఎన్.తేజ్‌భరత్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి29(ఆంధ్రజ్యోతి):ఎన్నికల ఖర్చుపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల మార్గదర్శకాలు, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మోడల్ ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించేలా ఎన్నికల వ్యయ పరిశీలకులు బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ స్పష్టంచేశారు. స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం సార్వత్రిక ఎన్నికల నియోజకవర్గ వ్యయ పర్యవేక్షణా అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనావళి అమలు విషయంలో ఎంసీసీ బృందాలు, ఏఈఆర్‌ఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్, వ్యయ పరిశీలకులు, పోలీసు అధికారులు, ఇతర ముఖ్య సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలు లేకుండా ఓటు హక్కును పారదర్శకంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బు వినియోగం మీద బాగా దృష్టి పెట్టాలన్నారు. నగదు లావాదేవీల విషయంలో సహేతుకమైన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. ఆధారాలు లేని డబ్బును ఆదాయ పన్ను చట్టాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల్లో మితిమీరిన అక్రమ ఖర్చులే అవినీతికి మూలకారణమని చెప్పారు. బృందంలో వీడియోగ్రాఫర్ కూడా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సీహెచ్ భరద్వాజ శ్రీనివాస్, ఎ.నాగేశ్వరరావు, ఎ.ఉషాశ్రీ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు
విజయవంతం చేయాలి

ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజప్ప



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఫిబ్రవరి 29: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మార్చి 6 నుంచి 11 వరకూ జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను అందరి సహకారంతో విజయవంతం చేయాలని, భక్తులకు సులభరీతిలో దర్శనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. భీమేశ్వరాలయంలో ఉత్సవ ఏర్పాట్లపై పలు శాఖల అధికారులు, భక్తకమిటీ ప్రతినిధులు, దేవదాయాధికారుల సమక్షంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాజప్ప హాజరయ్యారు. వివిధ శాఖల ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. అలాగే వైశ్యయూత్ అసోసియేషన్‌చే పదివేల మందికి అన్నదానం, భీమేశ్వరా అన్నదాన కమిటీచే అన్నదానం, వివిధ స్వచ్ఛంద సంస్థలచే చిన్నారులకు పాలు, రొట్టెలు, అల్పాహారం, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలపై సమీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకునే భక్తులకు స్నానాదికాలు అనంతరం శీఘ్రంగా స్వామి, అమ్మవారి దర్శనాలు త్వరతగతిన అయ్యేందుకు క్యూలైన్లను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. ఉత్సవాల పోస్టర్‌ను చినరాజప్ప, దవులూరి సుబ్బారావు, ఆలయ ఈవో నీలకంఠం, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ఆవిష్కరించారు.



ప్రసంగిస్తున్న స్వామీజీ భారతి మహాస్వామి

శివతత్వాన్ని అందరూ అలవర్చుకోవాలి

- శృంగేరి శ్రీ వీరుపాక్ష శ్రీ పీఠాధిపతులు

జగ్గంపేట, ఫిబ్రవరి 29: శివతత్వం అందరూ అలవర్చుకోవాలని శృంగేరి శ్రీ వీరుపాక్ష శ్రీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు గంబీరానంద భారతి మహాస్వామి అన్నారు. కాకినాడజిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి పార్థివ లింగ మహారుద్రాభిషేకం గురువారం 4వ రోజుకు చేరుకుంది. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని అమరేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శృంగేరి శ్రీ వీరుపాక్ష శ్రీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు గంబీరానంద భారతి మహాస్వామి హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాస్వామి మాట్లాడుతూ పార్థివం అంటే శరీరమని, మన శరీరంతో రూపొందించిన ఈ కోటి పార్థివ శివలింగాలు అభిషేకం శివుడికి అత్యంత ఇష్టమైనదని శివతత్వం అందరూ అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సాసా సతీష్, జీను మణిబాబు, అడబాల భాస్కరరావు, సుంకవిల్లిరాజు, పాలచర్ల సత్యనారాయణ, యల్లమిల్లి సీఎం, గోడే బాల, భక్తజనం పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, ఇతర ఇంజనీర్లు

మోతుగూడెం, ఫిబ్రవరి 29: సీలేరు కాంప్లెక్స్‌లో డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. డొంకరాయి జల విద్యుత్‌కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలైన నీరు పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి 16కిలోమీటర్లు పొడవైన పవర్ కెనాల్ ద్వారా అందజేస్తారు. ఈ పవర్ కెనాల్‌కు ఏటా నిర్వహణ పనులు చేపడుతుంటారు. ఈ ఏడాది కూడా పవర్ కెనాల్ నిర్వహణకు అధికారులు అనుమతులు కోరారు. వేసవి ఇబ్బంది దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 10నుంచి సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. ఈ నేపథ్యంలో విద్యుదుత్పత్తి ప్రారంభించేలోపే నిర్వహణ పనులకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ పనులను సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, సివిల్ ఎస్ఈ సివిల్ కేవీ ప్రసాద్‌కుమార్, డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ పరిశీలించారు.

ఆరోగ్యమిత్రలపై బదిలీ కత్తి



- పీహెచ్‌సీ ఆరోగ్యమిత్రలకు పూర్తిగా మంగళం పాడిన వైసీపీ ప్రభుత్వం
- సచివాలయ ఏఎన్ఎంలకు అదనపు బాధ్యతలు అప్పగింత
- ప్రక్షాళన పేరుతో స్థానచలనం?
- 17ఏళ్లుగా చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న ఆరోగ్యమిత్రలు
- పనిచేసే ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే యోచన
- పథకం నిర్వీర్యమయ్యే అవకాశం
- ఆందోళనలో ఆరోగ్యమిత్రలు

పేదరికం కారణంగా ఏఒక్కరూ నాణ్యమైన వైద్యానికి దూరం కాకూడదన్న ఉద్దేశంతో అందరికీ ఉచిత కార్పొరేట్ వైద్యం అందేలా మరింత మెరుగ్గా ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా పథకంలో రోజురోజుకూ కొత్తమార్పులు తీసుకువస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు ఇప్పటికే వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో కొన్నేళ్లుగా పీహెచ్‌సీల్లో అరకొర వేతనాలతో పని చేసిన ఆరోగ్యమిత్రలు కనుమరుగయ్యారు. పైగా వారిని నెట్‌వర్క్ మిత్రాలుగా మార్పు చేసేశారు. ఇప్పుడు మళ్లీ వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పథకం నిర్వీర్యమైపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దాపురం, ఫిబ్రవరి 29: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలను ఉద్యోగాలనుంచి పొమ్మన కుండా పొగపెడుతోంది వైసీపీ ప్రభుత్వం. ఈఉద్యోగాలనే నమ్ముకుని 17ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రాల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. వారిపై ప్రభుత్వం బదిలీ కత్తిని ప్రయోగించేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అసలే అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్న వారిపై బదిలీ కత్తిని ప్రయోగిస్తారన్న విషయంతో ఆరోగ్యమిత్రలు అయోమయంలో పడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో అయినా తమ బతుకులు బాగుపడతాయని ఆశించి భంగపడడంతో వారికి ఏం చేయాలో తోచడం లేదు. ప్రస్తుతం పనిచేసే ప్రాంతంనుంచి 20 కిలోమీటర్ల పరిధిలో వారిని మార్చేలా ప్రభుత్వం సమాయత్తమవుతునట్లు ఆరోగ్యమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆరోగ్యమిత్రలు గందరగోళంలో పడ్డారు. దీనిపై ఇప్పటికే మిత్రాలనుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిరుద్యోగులపై ఇటువంటి బదిలీ ప్రయోగాలు చేయడం ఏంటని వారు లోలోపల రగిలిపోతున్నారు. ఆరోగ్యమిత్రలను బదిలీ చేస్తే పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

17ఏళ్లుగా చాలీచాలని వేతనాలే..

17 ఏళ్లుగా అరకొర వేతనాలకు పనిచేస్తున్న తాము పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు చాలా కష్టపడ్డామని, గ్రామీణ ప్రాంత రోగులకు సైతం ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని అందించడానికి తామెంతో చిత్తశుద్ధితో పనిచేసినట్లు ఆరోగ్యమిత్రలు చెబుతున్నారు. తమ కృషివల్ల ఇప్పటివరకూ ఈపథకానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పదుల సంఖ్యలో అవార్డులు వచ్చినట్లు ఆరోగ్యమిత్రలు చెబుతున్నారు. తమకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని భావించామని, మళ్లీ ఈ బదిలీ ప్రక్రియను తెరమీదకు తీసుకురావడంతో తమకు ఏంచేయాలో తెలియడం లేదని వారు వాపోతున్నారు.

బదిలీతో పథకం నిర్వీర్యమయ్యే అవకాశం

స్థానికంగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలను ప్రస్తుతం పనిచేసే ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం ద్వారా పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లలో 200మంది వరకూ ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి 79 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా 80మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రులు కలిపి 249 ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యమిత్రలు పనిచేసే ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తే చాలీచాలని జీతంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనుకావడమే కాకుండా పథకం అమలు మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంది. తమకు ఇచ్చే వేతనంలో కోతలు మినహాయించుకుంటే తమకు చేతికి అందే రూ.13,500 వేతనంతో తాము సుదూర ప్రాంతాలకు వెళ్లి ఏవిధంగా పనిచేయగలమని, పైగా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని, తమకు టీఏ, డీఏలు సైతం లేవని చెబుతున్నారు. తమను ఈవిధంగా వేధించడం ఎంతవరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. పథకం విజయవంతంగా కొనసాగాలంటే ఎక్కడున్న వారిని అక్కడే ఉంచి, తమకు పూర్తిస్థాయిలో ఉద్యోగ భద్రతను కల్పించాలని ఆరోగ్యమిత్రాలు కోరుతున్నారు. పథకంలో మార్పులు చేస్తే సరిపోతుందని ఆరోగ్యమిత్రాలు భావిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నియమితులైన ఆరోగ్యమిత్రలు ప్రజాపథం, రచ్చబండ, తదితర కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడంతోపాటు ప్రజల్లో పథకానికి మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేశారు. ఆరోగ్యమిత్రలు స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో సత్సంబంధాలు కలిగి ఉండడంతో పథకం మరింత విస్తృతమయ్యే అవకాశం ఉంది.

ట్రస్ట్ నిర్ణయం మేరకే ఏ నిర్ణయమైనా..

ట్రస్ట్ నిర్ణయం మేరకే ఏదైనా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం బదిలీల విషయంపై స్పష్టత ఇంకా లేదు. ప్రస్తుతం ఆరోగ్యమిత్రలు ఎవరెవరు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారన్న విషయంపై వివరాలు సేకరించడం జరుగుతోంది. పీహెచ్‌సీల్లో పనిచేసే ఆరోగ్యమిత్రలను నెట్‌వర్క్ ఆస్పత్రులకు సర్దుబాటు చేశాం. బదిలీ ప్రక్రియపై ఆదేశాలు రావాల్సి ఉంది.

-డాక్టర్ ఎ.రాధాకృష్ణ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్, కాకినాడ

పెళ్లిరోజునే కడతేర్చాడు

- కాకినాడలోని జగన్నాథపురంలో కిరాతకం
- భర్త చేతిలో భార్య హతం



సంఘటనా స్థలంలో ఉన్న దివ్య మృతదేహం



దివ్య (ఫైల్)



నిందితుడు నూకరాజు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 29: అగ్నిసాక్షిగా తాళికట్టి ఎనిమిదేళ్లయ్యింది. వారికి ముత్యాల్లాంటి ఇద్దరు సంతానం. ఎనిమిదేళ్ల తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకునే పెళ్లి రోజునే అనుమానం పెనుభూతమై భార్యను అత్యంత కిరాతకంగా నరికి హతమార్చాడో కసాయి భర్త. ఈ సంఘటన గురువారం పట్టపగలు కాకినాడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... స్థానిక జగన్నాధపురం, పప్పులమిల్లు సమీపంలోని శ్రీరాంనగర్‌కు చెందిన బొందల దివ్య (26)కు భర్త నూకరాజు, ఫస్ట్‌క్లాస్ చదువుతున్న కుమారుడు ఏడేళ్ల నిహార్, ఎల్‌కేజీ చదువుతున్న నాలుగేళ్ల కుమార్తె నిస్సీ ఉన్నారు. వారిది ఉమ్మడి కుటుంబం కాగా నూకరాజు రేకుల షెడ్‌లకు సంబంధించిన ఫ్యాబ్రికేషన్ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. ఎంతో అనోన్యంగా సాగిన వారి దాంపత్య జీవితంలో అనుమానమనే బీజం నూకరాజు మనస్సులో నాటింది. దానికితోడు అతను తాగుడికి బానిసై తన భార్యను తరచూ మానసికంగా శారీరకంగా హింసించసాగాడు. అయినా దివ్య తన ఇద్దరు పిల్లల కోసం తన భర్త పెట్టే బాధలను దిగమింగుకుంటూ సంసారాన్ని ఈదసాగింది. గురువారం ఆ భార్యాభర్తల ఎనిమిదో పెళ్లిరోజు రానే వచ్చింది. ఎన్నో తీపి జ్ఞాపకాలతో భర్తతో గడుపుదామనుకున్న దివ్యకు ఆమె భర్త మృగంలా ఎదురుపడ్డాడు. ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి తన భార్యపై అకారణంగా పిడుగుద్దులు కురిపించాడు. ఆ దాడిని ఆమె తట్టుకోలేక ఇంటి నుంచి బయటకు పరుగుపెడుతుండగా నూకరాజు తనతో తెచ్చుకున్న పదునైన వేట కత్తితో ఆమెను వెంబడించి విచక్షణా రహితంగా ఆమె మెడపై నరికాడు. అదే సమయంలో దివ్య తోటికోడలు తల్లి అడ్డుపడడంతో ఆమెపై కూడా నూకరాజు కత్తితో దాడి చేశాడు. దాంతో ఆమె చేతివేళ్లు రెండు తెగిపడ్డాయి. దివ్య మెడ భాగం సగం తెగిపోవడంతో ఆమె గిలగిలా తన్నుకుంటూ తీవ్ర రక్త స్రావంతో కుప్పకూలి తనువుచాలించింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ వాడవెల్లి సురేష్‌బాబు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అయితే స్కూల్ నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన పిల్లలు ఇద్దరు అమ్మ అన్నం పెట్టమ్మ అంటూ విగతజీవురాలైన దివ్యను అడుగుతుండడం చూపరుల కంటతడిపెట్టించింది. ఓ పక్క తల్లి లేక మరో పక్క తండ్రి జైలుకు వెళ్లడంతో ఆ చిన్నారుల పరిస్థితి అగమ్య గోచరమైంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు పైపైకి

- కిలో రూ.300 వరకు అమ్మకాలు
- వారం రోజుల్లో కిలో రూ.80లు పెరిగిన ధర



తుని రూరల్/గండేపల్లి, ఫిబ్రవరి 29: చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. చికెన్ ధర వారం రోజుల్లో కిలోకు రూ.100 పెరిగింది. దీంతో ప్రస్తుతం కిలో రూ.300 వరకు పలుకుతుంది. చికెన్‌ధరలు గణనీయంగా పెరగడానికి కారణం కోళ్ళ ఉత్పత్తులు తగ్గడమే కారణమని కోళ్ల నిర్వాహకులు, వ్యాపారులు అంటున్నారు. మార్చి, ఏప్రిల్‌లలోకూడా ఇదే పరిస్థితి కొనసాగేలా ఉంది. గుడ్డు ధర కూడా ఇలాగే కొనసాగుతుంది. బహిరంగ మార్కెట్‌లో రూ.5నుంచి రూ.7 వరకు అమ్మకాలు జరుపుతున్నాయి. కార్తీకమాసం సమయంలో కోడిమాంసం ధరలు భారీగా పడిపోవడం, కేజీ రూ.130కే అమ్మిన పరిస్థితులు ఏర్పడటంతో అప్పట్లో కోళ్లఫారాల యాజమాన్యాలు నష్టాలు చవిచూడడంతోపాటు ఇతర జిల్లాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు వెలుగుచూడడంతో కోళ్ల పెంపకందారులు పెంపకాన్ని ఒక్కసారిగా తగ్గించేశారు. మార్కెట్‌లో అయోమయం పరిస్థితులు తలెత్తడంతో తల్లికోళ్ళను కూడా గిట్టుబాటు కాక అమ్మేశారు. ఫలితంగా ఉత్పత్తి తగ్గి కోళ్ళ కొరతతో మాంసానికి డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో చికెన్ ధరలు అంతకంతకూ పెరుగుతూ వస్తున్నాయి. హోల్‌సేల్‌గా కోళ్ళ ధర రూ.70 నుంచి రూ.80లకు ఎవచ్చేదని అయితే ఈ వారం రోజుల వ్యవధిలోనే కిలో హోల్‌సేల్‌గా రూ.140 నుంచి రూ.150లకు పెరిగిందని, దీంతో మాసం కిలో రూ.280 నుంచి రూ.300లకు గిట్టుబాటు కాదని వ్యాపారులు అంటున్నారు.

దీక్ష విరమించిన సూర్యచంద్ర

గోకవరం, ఫిబ్రవరి 29: గోకవరం మండలం అచ్యుతాపురంలో ఆరు రోజులుగా అంతిమ ఆమరణ నిరాహారదీక్ష పేరుతో ఆందోళనకు దిగిన జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు గురువారం తమ దీక్షను విరమించారు. జనసైనికుల కోరిక మేరకు తాము స్వచ్ఛందంగా నిరసన దీక్షను వీడుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సూర్యచంద్ర మాట్లాడుతూ జగ్గంపేట సీటు దక్కక పోయినప్పటికీ తనకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై ఎటువంటి కోపతాపాలు లేవన్నారు. అయితే తాను నాలుగేళ్లుగా పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించినా సీటు ఎందుకు నిరాకరించారో అర్థం కావడం లేదన్నారు. ఎప్పటికైనా తాను అసెంబ్లీలో అడుగు పెడతానని సూర్యచంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో జనసైనికులతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

అవినీతి అధికారికి
మూడేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారికి కోర్టు జైలు శిక్ష విధించింది. అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల్లోని రేషన్ దుకాణాలకు మండపేట నుంచి నిత్యావసర వస్తువులు సరఫరా చేయడానికి వర్క్ ఆర్డర్ కోసం తన కుమారుడిని కాకినాడలోని పౌరసరఫరాలశాఖలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ముడుగు జాన్ కెన్నడి రాజ్‌కుమార్ లంచం అడుగు తున్నారని పెనికేరుకు చెందిన వైట్ల వెంకట్రావు ఫిర్యాదు చేశారు. 2016 సెప్టెంబరు 23న వెంకట్రావువద్ద నుంచి రాజ్‌కుమార్ రూ.20వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరంలోని ఏసీబీ కేసుల ప్రత్యేకకోర్టు నేరస్తుడికి గురువారం మూడేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి.శేషయ్య, ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారని.. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేశారని డీఎస్పీ తెలిపారు.

సత్యదేవుడికి రూ.20కోట్లు ప్రసాద్ స్కీం నిధులు

- మంజూరు చేస్తూ కేంద్రం ఆదేశాలు



అన్నవరం ఫిబ్రవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వ పథకం అయిన ప్రసాద్ స్కీం నిధులు ఎట్టకేలకు మంజూరయ్యాయి. దాదాపు 8ఏళ్లుగా ఈ పథకం నిధులు కోసం భక్తులు, అధికారులు ఎదురుచూస్తున్నారు. 2015లో దీనిపై ప్రతిపాదన పంపించాలని కేంద్ర టూరిజం అధికారులు లేఖ రాయడంతో రాష్ట్ర టూరిజం అధికారులు దేవస్థానం అధికారులు రూ.92కోట్ల పనులకు ప్రతిపాదన పంపించారు. వీటిని తగ్గించి పంపించాలని రూ.50కోట్లు మాత్రమే వస్తాయని తెలపడంతో మరోసారి కొన్ని పనులు తీసివేసి రూ.50కోట్లకు అంచనాలు పంపించారు. దీనిపై ఆశలు వదులుకున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటితో ప్రధానంగా అన్నదాన భవనం నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు. దీనికి రూ.10కోట్లు వ్యయం కానుండగా మిగిలిన రూ.10కోట్లతో అత్యవసర పనులకోసం ఛైర్మన్, సభ్యులతో ఈ నెల 7న జరిగే పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయిస్తారు.

టమాటా నేలచూపులు

- కిలో రూ.5కు పడిపోయిన ధర



గండేపల్లి, ఫిబ్రవరి 29: ప్రస్తుత పరిస్థితుల్లో టమాటా నేల చూపులు చూస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.5 పలుకుతూ రైతులకు నష్టాన్ని మిగుల్చుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కోత కూలి రావడం లేదని ఆవేదన చెందుతున్నారు .ఇదే టమాట 8నెలలు కిందట కిలో రూ.200కు పైగా ధర పలికి రైతులకు లాభాలు తెచ్చిపెట్టడంతో పాటు కొనుగోలుదారులకు చుక్కలు చూపించిన సంగతి తెలిసిందే. ఈ టమాటలకు అప్పట్లోసెక్యూరిటీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పరిస్థితులు ఉన్నాయి. అయితే రానురాను ఈ టమాటా సాగు పెరగడంతో ధర దఫదఫాలుగా తగ్గికుంటూ వచ్చింది. మధ్యమధ్యలో ధర పెరిగినప్పటికీ ప్రస్తుతం కిలో ధర రూ.5లకు పడిపోయింది.దీంతో రైతులు నష్టాలు ఎదుర్కొంటున్నామంటున్నారు. మళ్లీ ఈ టమాటా ఎప్పుడు లాభాల్లోకి తీసుకువెళుతుందోనని రైతులు ఆశగా చూస్తున్నారు. అయితే రైతులకు లాభాలు రానప్పటికీ రీసెల్ వ్యాపారులు, చిరు వ్యాపారులు కిలో రూ.30లు పైగా అమ్ముకుంటూ లాభాలు పొందుతున్నరని చెప్పవచ్చు.

ఊపందుకున్న డిజిటల్ పేమెంట్‌లు

- సన్నగిల్లిన కరెన్సీ చలామణి
- రూ.10 కమీషన్‌పై ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న వ్యాపారులు
- ఎక్కడికక్కడ ఫోన్‌పే చేసి నగదు పొందుతున్న వినియోగదారులు

కరప, ఫిబ్రవరి 29: మారుతున్న కాలంతోపాటు డిజిటల్ పేమెంట్‌లు ఊపందుకుంటున్నాయి. దీంతో కరెన్సీ చలామణి సన్నగిల్లుతోంది. ఇదే అదునుగా రూ.10 కమీషన్‌పై కొందరు వ్యాపారులు ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడిలో ఒక ఇంటి ముందు ఫోన్‌పే చేయబడును అనే ఫెక్స్‌ను ఏర్పాటుచేశారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఇళ్ల వద్ద ఫ్లెక్స్‌లు ఏర్పాటు చేసి మరీ ఈ వ్యాపారాలు చేస్తున్నారు. బడ్డీ కొట్టు నుంచి మాల్స్ వరకు ప్రతి కొనుగోలుకు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్‌లను వినియోగిస్తున్నారు. రూపాయినుంచి వందలు, వేలల్లో చేసే కొనుగోళ్లకు పేమెంట్ యాప్‌ల స్కానర్స్‌ను ఉపయోగించి క్షణ కాలంలో బిల్లులు చెల్లిస్తున్నారు. వీటితోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జేబు దొంగలు, చిల్లర సమస్య నుంచి విముక్తి, ఇతర పలు రకాల ప్రయోజనాలు ఉండడంతో డిజిటల్ లావాదేవీలు చేసేందుకు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో అధిక శాతం మంది చేతిలో సెల్, జేబులో కార్డులు తప్ప కరెన్సీ తీసుకెళ్లడానికి ఇష్టపడడంలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది తమ వ్యాపార దృక్పథాన్ని ప్రదర్శించి ఎక్కడికక్కడ ఫోన్‌పే ఫ్లెక్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పేమెంట్ యాప్‌ల్లో డబ్బులు వేయాలన్నా లేక నగదు కావాలన్నా కమీషన్ తీసుకుంటూ తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. అది ఎటువంటి లావాదేవి అయినా, ఎంతైనా సరే ఒక వెయ్యికి రూ.10 చొప్పున కమీషన్‌గా తీసుకుంటూ రెండు చేతుల సంపాదిస్తున్నారు. ఈ ఐడియా బాగుండడంతో ఎక్కడికక్కడ పలువురు కిరాణా, ఫ్యాన్సీ దుకాణదారులతోపాటు ఔత్సాహికులు ఈ తరహా వ్యాపారానికి తెరదీస్తున్నారు. పెదపూడి మండలం కాండ్రేగుల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పది రూపాయల కమీషన్‌పై లక్షలాది రూపాయల డిజిటల్ లావాదేవీలు నిర్వహించడంతో ఇటీవల ఐటీశాఖ నుంచి అతడు నోటీసులు అందుకున్నట్టు తెలిసింది. డిజిటల్ పేమెంట్స్ యాప్‌లను ఉపయోగించి సరికొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది.



కరప : గొర్రిపూడిలో ఒక ఇంటి వద్ద ఫోన్‌పే చేయబడునని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

ఏజెన్సీ సమాచారం

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎలిజబెత్

చింతూరు, ఫిబ్రవరి 29: బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆమేరకు అవసమయ్యే ఏర్పాట్లు పూర్తయినట్లు చింతూరు ప్రభుత్వ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎలిజబెత్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదిమ గురుకుల కళాశాల, కస్తూర్బా కళాశాలలకు చెందిన మొదటి ఏడాదికి చెందిన 469 మంది, ద్వితీయ సంవత్సరానికి చెందిన 224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. ఉదయం తొమ్మిదిగంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకుగాను ఆయా విద్యార్థులు విధిగా ఉదయం ఎనిమిదిన్నరకు పరీక్షాహాలు వద్దకు హాజరుకావాల్సి ఉందన్నారు. పరీక్షలు నిఘానేత్రాల నడుమ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తయ్యాయని ఎలిజిబెత్ పేర్కొన్నారు.

వై.రామవరంలో...

వై.రామవరం: వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ ఈశ్వరకృప తెలిపారు. ఈ కేంద్రంలో వై.రామవరం, పి.ఎర్రగొండ గురుకుల కళాశాల, తోటకూరపాలెం కేజీబీవీ కళాశాల నుంచి మొత్తం 163మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అలాగే 2వతేదీ నుంచి మొదలయ్యే ద్వితీయసంవత్సర పరీక్షలకు 129 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30లోపు విద్యార్థులు హాజరుకావాలని 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అడ్డతీగలలో అకాల వర్షం



అడ్డతీగలలో కురుస్తున్న వర్షం

అడ్డతీగల, ఫిబ్రవరి 29: మండలంలో గురువారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గురువారం మ ధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో వాతావరణంమారి కారు మబ్బులు కమ్ముకున్నాయి. వెంటనే ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం ఎండ తీవ్రతతో సతమతమవు తున్న ప్రజలు ఈ అకాల వర్షానికి సేదతీరారు. మరోప్రక్క ఈదురుగాలులకు చెట్లు కూలాయి.

కొబ్బరికాయలు వేలంపాట రూ.27,500

కూనవరం, ఫిబ్రవరి 29: మండలంలోని మర్రిగూడెంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా కొబ్బరికాయలు వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా గురువారం నిర్వహించిన వేలంపాట రూ.27500 పలికింది. కూనవరంనకు చెందిన సోడే మహేంద్ర ఈ కొబ్బరికాయలు వేలంపాటను దక్కించుకున్నారు. ప్రసాదాల వేలంపాటను మాత్రం ఎండో మెంట్ అధికారులు నిర్వహించలేదు. గుట్టుచప్పుడుగా తమకు ఇష్టమైన వారికి ప్రసాదాల వేలంపాట అప్పగించడంతో కొంతమంది ఎండోమెంట్ అధికారులపై వాగ్వివాదానికి దిగారు. వేలంపాట నిర్వహించకుండా వేరే వారికి ఎలా అప్పగిస్తారని కొబ్బరికాయలు వేలంపాట నిర్వహించినట్టే ప్రసాదాల వేలంపాట నిర్వహించాలని పట్టుపట్టారు. ఎండోమెంట్ అధికారులు ఎవరి మాటలు పట్టించుకోకుండా తమకు ఇష్టమొచ్చిన వారికి గుట్టుచప్పుడుగా ప్రసాదాల పాట అప్పజెప్పడంతో విమర్శలు వచ్చాయి. మార్చి 8న మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి.

నాగమ్మతల్లి అమ్మవారి ఊరేగింపు


నాగమ్మతల్లి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

వై.రామవరం, ఫిబ్రవరి 29: వై.రామవరం గ్రామంలో నాగమ్మతల్లి అమ్మవారికి నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కోసం గురువారం అమ్మవారి విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు పలు గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. ఈనెల 3న ఆలయంలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠ చేస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా మూడు రోజులపాటు హోమాలు నిర్వహించి అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠిస్తారన్నారు. పలు గ్రామాల గుండా ట్రాక్టర్లపై ఊరేగింపుగా వెళ్లి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. వాల్మీకివీధి భజనబృందం కార్యక్రమంలో పాల్గొని భజన గీతాలు ఆలపించారు.

వైసీపీ పాలనలో నిర్వాసితులకు చేసిందేమిటి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రంగారెడ్డి

వరరామచంద్రాపురం, ఫిబ్రవరి 29: టీడీపీ, జనసేనల విస్తృస్థాయి కార్యకర్తల సమావేశం వీఆర్‌పురంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో పోలవరం నిర్వాసితులకు ఏమిచేశారని ప్రశ్నించారు. ముంపు మండలాల్లో సర్వం కోల్పోతున్న పోలవరం నిర్వాసితుల సమస్య ప్రతిసారీ కప్పదాటు వ్యవహారంతో వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వ వ్యవహారశైలిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, కేంద్ర ప్రభుత్వం దగ్గర నుంచి తెచ్చిన వేలకోట్ల రూపాయలు ఇప్పటివరకు ఎంతమంది నిర్వాసితులకు పరిహారం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లను కార్యకర్తలుగా చేసి వారి శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. అనంతరం తెలుగు యువత రాష్ట్ర నాయకులు బొర్ర నరేష్ మాట్లాడుతూ పరిహారం పొందిన భూములకు ఐదు లక్షలు ఇస్తానని ఇప్పటివరకు దిక్కులేదన్నారు. టీడీపీ మండల కార్యదర్శి బురక కన్నారావు, బీరక ప్రకాష్‌రావు, పెందుర్తి సుదర్శన్ ఐటీడీపీ కన్వీనర్ ముత్యాల సిద్దు, ఆకోజు భాగ్యలక్ష్మి, సవలం రాజు, జనసేన నాయకులు ప్రమీలా, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, అంజనరావు, పాల్గొన్నారు.

'పోలవరం నిర్వాసితుల ఓట్ల బదిలీ అక్రమం'

రంపచోడవరం, ఫిబ్రవరి 29: ఓటర్లకు సమాచారం లేకుం డా దేవీపట్నం మండల నిర్వాసితులను జగ్గంపేట నియోజక వర్గంలోకి మార్చడం అక్రమమని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు లోతా రాంబాబు, మట్ల వాణిశ్రీలతో కలిసి ప్రకట విడుదల చేశారు. తొయ్యేరు, దేవీపట్నం గ్రామాలకు పునరావాసం, పరిహారం అందకుండానే జగ్గంపేట నియోజకవర్గానికి మార్పు చేయడంపై ప్రశ్నించారు. ఓటర్లకు సమాచారం ఇవ్వకుండానే 2400 మందిని వేరొక నియోజకవర్గానికి మార్చడం అధికార వైసీపీ అక్రమాలకు నిదర్శనమన్నారు. వైసీపీ నాయకులకు ఓట్లు అక్రమాలలో ఉన్న శ్రద్ధ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో లేదని ఎద్దేవా చేశారు. ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠినచర్యలు చేప ట్టాలని, అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జెండా సభతో దద్దరిల్లిన తాడేపల్లి ప్యాలెస్

» టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 29: తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ-జనసేన రాజమహేంద్రవరం ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు కోట్ల ప్రజల భవిష్యత్ కోసం రెండు పార్టీలు కలిసాయని, రాష్ట్ర పునఃనిర్మాణానికి ప్రజలందరు చేతులు కలపాలని కోరారు. జగన్ పాలనంతా అరాచకమేనని, చంద్రబాబు సంక్షేమాన్ని అందిస్తే జగన్ వాటిని నిలుపుదల చేసి పేదల బతుకులు నాశనం చేశాడన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో టీడీపీ-జనసేన దూసుకుపోతుందని అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పులివెందులలో జగన్‌కు ఓటమి తప్పదన్నారు.

వైసీపీ పాలనకు మంగళం పాడుదాం

రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనకు మంగళం పాడేందుకు ప్రతిఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఆదిరెడ్డి వాసు పిలుపునిచ్చారు. స్థానిక 48వ డివిజన్‌లో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి పర్యవేక్షణలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్‌తో కలిసి వాసు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే మేజర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ -జనసేన కూటమిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కానేటి ప్రభుదాసు, కానేటి కృపామణి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసును అఖండ మెజార్టీతో గెలిపిస్తాం

వెలమ సంఘం నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 29: రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదిరెడ్డి వాసును అందరి సహకారంతో అఖండ మెజార్టీతో గెలిపిస్తామని కొప్పు వెలమ సంఘం నేత వాసిరెడ్డి రాంబాబు, అధ్యక్షుడు కిలపర్తి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు కొల్లి బుజ్జి, ఉద్యోగ యూనియన్ అధ్యక్షుడు వేమిరెడ్డి సత్యనారాయణ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెలమ సంఘీయులను టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గుర్తించి సీటు ఖరారు చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. ఆదిరెడ్డి కుటుంబం రాజకీయ కుటుంబంగా నిరంతరం ప్రజల మధ్య వుంటూ అనేక సమస్యలపై పోరాడుతోందన్నారు. రాజమహేంద్రవరంలో కొప్పువెలమలు 6వేల మందే ఉన్నారని ఒక చోటా నాయకుడు అంటున్నాడని, అతనికి తెలియదేమో నగరంలో తాము 25వేల పైబడి ఉన్నామన్నారు. సమావేశంలో సప్పా వెంకటరమణ, చల్లా బాలమురళీ, సప్పా ఉమానాగేశ్వరరావు, దొగ్గా వేణు, తెంటు సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసన్న కల్యాణోత్సవాలు ఘనంగా జరిపించండి

» ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలి
» సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
» గత దుర్ఘటనలు పునరావృత్తం కాకూడదు: ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, ఫిబ్రవరి 29: చారిత్రాత్మక కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు ఇప్పటి నుంచే ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో చేపట్టాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి గురువారం సాయంత్రం స్వామి వారి కల్యాణ మండపంలో అన్నవరం దేవస్థానం అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామి కల్యాణోత్సవాలు, రథోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు ఇతర ప్రాంతాల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్‌పై ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయ సమీపంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రామచంద్రమోహన్ మాట్లాడుతూ ఉత్సవ ఏర్పాట్లపై వైద్య ఆరోగ్యం, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఎలక్ట్రికల్, ఆర్టీసీ, అగ్నిమాపక, రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథాన్ని అదుపు చేసేవారికి ప్రత్యేక ఐడీ కార్డులు, డ్రస్ కోడ్ ఏర్పాటు చేయాలన్నారు. రథచక్రల వద్ద భక్తులు గుమిగూడకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీ శ్రీనివాస్‌కు సూచించారు. ఆర్డీవో చైత్ర వర్షిణి మాట్లాడుతూ గత ఏడాది రథోత్సవంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరారు. సమావేశంలో దేవస్థానం చైర్మన్ పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, ఎంపీపీ వుల్లి సూర్యకుమారి, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఎంపీటీసీ కాళ్ళ వీరబాబు, పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చకస్వాములు అన్నవరం దేవస్థానం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతానికి కృషి చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 29: జిల్లాలో మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీల పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎన్.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లోనూ అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ వ్యాక్సిన్ వేసేలా లక్ష్యంగా నిర్ణయించామని, ఈ మేరకు పోలియో వ్యాక్సిన్ సిద్ధం చేశామని తెలిపారు. సమావేశంలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, డెమో డాక్టర్ సత్యకుమార్, నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అభిషేక్ మౌనిక, చైతన్య, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అనపర్తి, ఫిబ్రవరి 29: అనపర్తి మండలంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు. మండలంలో అనపర్తిలో జీబీఆర్ కళాశాల, కొత్తూరు సెంటినరీ కళాశాల, ఎల్ఎన్‌పురంలో బీఆర్ అంబేడ్కర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు సంబంధించి జీబీర్ కళాశాలలో 1070మంది, కొత్తూరు కళాశాలలో 450మంది, ఎల్ఎన్ పురం కళాశాలలో 701మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కొత్తూరు, ఎల్ఎన్‌పురం కళాశాలల్లో పరీక్షలకు హాజరయ్యే బయట కళాశాలల విద్యార్థులు పరీక్ష సమయం కంటే అర్థగంట ముందే పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని, రెండు చోట్ల రైల్వే గేట్లు ఉన్నందున్న విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ముందుగానే చేరుకోవాలని ప్రిన్సిపాల్స్ తెలిపారు.

రంపయర్రంపాలెంలో వ్యక్తి ఆత్మహత్యయత్నం

అడ్డుకున్న పోలీసులు

గోకవరం, ఫిబ్రవరి 29: గోకవరం మండలం రంపయర్రంపాలెంలో ఇంటి వివాదం విషయంలో ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన పిల్లి రామకృష్ణ కుటుంబసభ్యులు ఇంటి స్థలం కోసం అనేక పర్యాయాలు అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. కానీ అధికారుల నుంచి ఎటువంటి న్యాయం జరగలేదు. దీంతో గంగాభవానీ నగర్ కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో తాటాకిల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నాడు. అయితే ఆ ఇంటిని పోలీస్ అధికారుల సహకారంతో రెవెన్యూ పంచాయతీ అధికారులు కూల్చేందుకు ఉపక్రమించారు. ఆ సమయంలో రామకృష్ణ, భార్య దుర్గాదేవి, ఇద్దరు పిల్లలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా అధికారులు వినకపోవడంతో రామకృష్ణ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా దగ్గరిలో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. సుమారు రూ.10 వేలు ఖర్చు చేసి నిర్మించుకున్న పాకను కూల్చేస్తే తన కుటుంబం వీధిన పడుతుందని రామకృష్ణ లబోదిబోమంటూ విలపించాడు. చివరకు అధికారులు తమ ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకొని వెళ్లిపోయారు.

పనిలో అంకితభావంతో చెరగని ముద్ర

రంగంపేట, ఫిబ్రవరి, 29: అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుడు విద్యార్థులు, స్థానికుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటారని హెచ్‌ఎం వి.పార్థసారధి అన్నారు. రంగంపేట జడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు వల్లు జగదీశ్వరరావు పదవీ విరమణ సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలం పాతకోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు భీమవరపు చక్రధర రామకృష్ణారావు పదవీ విరమణ సభలో ప్రధానోపాధ్యాయుడు పి.చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగింది. దీనికి ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావులు ముఖ్యతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారావును పాఠశాల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవరసాని లక్ష్మీ, ఎంపీటీసీ సుంకర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'జీవితంపై అవగాహనా లోపంతోనే నేరాలు'

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): జీవితం పట్ల అవగాహనా లోపంతోనే నేరాలు చేస్తూ పౌరులు జైళ్ల పాలవుతున్నారని ప్రముఖ సామాజిక విశ్లేషకుడు మలసాని శ్రీనివాస్ అన్నారు. సెంట్రల్ జైలులో గురువారం సామాజిక పరివర్తన కేంద్రం ఆధ్వర్యంలో ఖైదీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ నేతృత్వంలో ఖైదీలకు మానసిక పరివర్తనపై శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో అద్భుత గ్రంథాలు చాలామంది జైల్లో ఉండి రాసినవేనని గుర్తుచేశారు. జైల్లోని శిక్షణలను సద్వినియోగం చేసుకుని విడు దలైన తర్వాత మంచి పౌరులుగా, సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. డీఎస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఖైదీల్లో పరివర్తన తీసు కొచ్చే దిశగా జైలులో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు. విడుదలైన తర్వాత వ్యసనాలకు బానిసలు కాకుండా, నేరాలకు పాల్పడకుండా, అందరితోనూ ఆత్మీయంగా ఉంటూ, తమ కుటుంబంతోపాటు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఖైదీల సంక్షేమ అధికారి ఆర్.శ్రీనివాసరావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో కలెక్టర్ క్షేత్రస్థాయి సమీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 29: జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలతో సమీక్షలు న్విహించారు. ఓటర్లలో చైతన్యం తీసుకురావడం, వాస్తవ పరిస్థితులు అధ్యాయనం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించామన్నారు. రాజమహేంద్రవరం రూరల్, అర్బన్‌లో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడారు. 2019 ఎన్నికలలో ఎంత ఓటింగ్ శాతం నమోదైందో.. ఇప్పుడు ఇంకా ఓటింగ్ శాతం పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో పలు సూచనలు చేశారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట రూరల్ ఆర్‌వో, తహశీల్దార్ వైకేవీ అప్పారావు, డీటీ ఎంకే సుధీర్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థులు గోరంట్ల, ఆదిరెడ్డిలకు విశ్వబ్రాహ్మణ బీసీ సాధికార సమితి మద్దతు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 29: రాజమహేంద్రవరం రూరల్ నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అర్బన్ నుంచి పోటీ చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్‌లకు టీడీపీ విశ్వబ్రాహ్మణ బీసీ సాధికార సమితి నాయకులు మద్దతు తెలిపారు. గురువారం వారి నివాసాలకు వెళ్లి కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచార్యులు, వీరమల్లు సత్తిబాబు, కర్రీ అప్పల స్వామి, అందూరు సత్యనారాయణ, కొమ్మోజి బ్రహ్మాజీ, తణుకు సత్యవరప్రసాద్, దార్ల కామేశ్వరరావు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న ట్రస్ట్ సేవలు అభినందనీయం

కడియం, ఫిబ్రవరి 29: పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. కడియపులంకలో పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ స్వీయనిధులు రూ.25 లక్షలతో నిర్మించిన జడ్పీ హైస్కూల్ రక్షణ గోడను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పల్ల వెంకన్నను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ వెంకన్న కుమారులు తండ్రి పేరిట అభివృద్ధి పనులు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, గట్టి నర్సయ్య, పుల్లా రామారావు, పాటంశెట్టి రాంజీ, తాడాల చక్రవర్తి, నర్సరీసంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో లజపతిరాయ్ పదవీవిరమణ సభ.. ఎంఈవో వి.లజపతిరాయ్ పదవీవిరమణ సభ గురువారం జరిగింది. దీనికి మంత్రి వేణు, ఎమ్మెల్యే గోరంట్ల, కందుల దుర్గేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా లజపతిరాయ్ దంపతును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, గిరజాల బాబు, యాదల స్టాలిన్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని పాల్గొన్నారు.

అనపర్తిలో టెన్షన్... టెన్షన్

అనపర్తి, ఫిబ్రవరి 29: అనపర్తిలో టీడీపీ, వైసీపీ నాయకులు బలాబలాలకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఐదేళ్ల పదవీ కాలంలో సుమారు 500కోట్ల అవినీతికి పాల్పడ్డారని అవినీతిని నిరూపించేందుకు ఆధారాలతో సహా తాను సిద్ధమంటూ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గతంలో సవాల్ చేశారు. ఈక్రమంలో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డికి చెందిన గంగిరెడ్డి నర్సింగ్ హోమ్‌కు వెళ్లి అక్కడి సిబ్బందికి కరపత్రాలు పంచారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తాను లేకుండా ఆసుపత్రికి వెళ్లడమేమిటని దమ్ముంటే ముందుగా చెప్పి రావాలంటూ దుయ్యబట్టారు. దీనికి స్పందించిన మాజీ ఎమ్మెల్యే మార్చి 1న ఉదయం 11గంటలకు మీ ఇంటికి వచ్చి అవినీతిపై చర్చించడానికి తాను సిద్ధమంటూ మీరు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. కాని నేటి వరకు ఎమ్మెల్యే నుం స్పందన రాలేదు. మార్చి 1వ తేదీ సమీపిస్తుండడంతో శుక్రవారం ఏం జరుగుతుందోనని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 29: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నెల వారీ సమావేశం ఆర్యాపురంలోని ఏబీ నాగేశ్వరరావు పార్కులో అశోక్‌కుమార్ జైన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిచ్చుక వెంకటరాంబాబు, బొమ్మబోయిన వెంకట శ్రీరామమూర్తి, కేకే సంజీవరావు మాట్లాడుతూ సర్వోత్తమరావు పత్రికా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాసాని శంకరరావు, బండి నరేంద్ర, యం.పార్వతి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు ఉద్యోగులకు సత్కారం


ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగిని సత్కరిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు ఉద్యోగులను ఎస్పీ జగదీశ్ సత్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏ-సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జీవీ రమణమూర్తి, సాయుధ రిజర్వు విభాగంలో పనిచేస్తున్న ఐ.వెంకట్రావు(ఏఆర్‌హెచ్‌సీ 3090) ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్కార సభలో ఎస్పీ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌కి వారు చేసిన సేవలను ప్రశంసించారు. ఉద్యోగ విరమణానంతర జీవితం ప్రశాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఎలాంటి అవసరం ఉన్నా స్వయంగా వచ్చి తనకు చెప్పవచ్చని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనీల్ కుమార్(శాంతిభద్రతలు), టి.సర్కార్(క్రైమ్స్), ఎల్.చెంచిరెడ్డి (ఏఆర్), డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

సెమీకండక్టర్ చిప్స్‌పై విస్తృత పరిశోధనలు జరగాలి

రాజానగరం, ఫిబ్రవరి 29: భారతదేశంలోని సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ నగరాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మెమ్స్, సెమీకండక్టర్ చిప్స్‌పై విస్తృత పరిశోధనలు జరిగాలని బెంగుళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ సెమీ కండక్టర్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్(ఏ యూనిట్ ఆఫ్ సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ రీసెర్చ్)సితార్ డైరెక్టర్ ఎం.రవి అన్నారు. గైట్ కళాశాలలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మెమ్స్ ఫ్యాబ్రికేషన్ ఎట్ సాక్ అనే అంశంపై అధ్యాపకులకు గురువారం నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాపులో ఆయన రీసోర్స్‌పర్సన్‌గా హాజరై మాట్లాడారు. తమ సంస్థ కార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం గైట్‌లో పరిశోధనాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని గైట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆర్ఎస్ రాజు కోరారు. కార్యక్రమంలో భాగంగా సితార్ డైరెక్టర్ రవిని కళాశాల తరపున సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ఆర్ఎస్ రావు, హెచ్‌వోడీ బి.శ్రీనివాసరాజా, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తటవర్తి గురుకులంతో 'ఆర్ట్స్' ఒప్పందం


అవగాహన పత్రాలు ఇచ్చిపుచ్చుకుంటున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 29: భారతీయ కళల ప్రచారంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆస్ట్రేలియా కేంద్రంగా సేవలందిస్తున్న తటవర్తి గురుకులం అనే విద్యాసంస్థతో అంతర్జాతీయ ఒప్పందం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈమేరకు గురువారం తటవర్తి గురుకులం తరపున అష్టావధాని తటవర్తి శ్రీకల్యాణ చక్రవర్తి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే ఒప్పంద పత్రాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా అవధాన కళా పరిచయం అనే సర్టిఫికెట్ కోర్సును కళాశాల లలిత కళల విభాగం త్వరలో ప్రారంభిస్తుందని తెలిపారు. విశ్వ వ్యాప్తంగా ఆసక్తికల్గిన వారందరికీ ఈ కోర్సుచేసే అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో లలిత కళల విభాగాధిపతి కస్తూరి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

సీతానగరంలో బీజేపీ పోరుయాత్ర

సీతానగరం, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన ఆహారం ఇవ్వడంలేదని, డీజిల్, కరెంట్ బిల్లులు ఏడు సార్లు పెంచారని, పెట్రోల్, నిత్యావసరా ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, విద్యుత్ బిల్లులు చూస్తుంటే షాక్ కొడుతోందని బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరి అన్నారు. గురువారం బీజేపీ పోరుయాత్రలో భాగంగా సీనియర్ నాయకుడు ఏపీఆర్ చౌదరితో కలసి ఆయన సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ కేంద్రాలు కేంద్ర నిధులతో ఏర్పాటుచేసుకుని కనీసం నరేంద్రమోదీ ఫొటో లేకుండా వైసీపీ రంగులు, జగన్ ఫొటోలు వాడుకుంటున్నారన్నారు. కేంద్రం జారీ చేసిన ఆయుష్మాన్‌భవ కార్డులను గ్రామవలంటీర్లు వైసీపీ వారికే పంచి మిగిలిన వారికి ఇవ్వలేదన్నారు. అనుమతులు లేని మునికూడలి ఇసుకర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్నారని, అధికారులు అమ్ముకుంటున్నారా, నాయకులు అమ్ముకుంటున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉండవల్లి సాయి, బాలయోగి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 29: విద్యార్థులు బ్యాంకింగ్ వ్యవస్థ అందిస్తున్న సేవలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు మొదలైన సేవలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో గురువారం జరిగిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ఉద్యమం చేపట్టాలని, ఈ వయస్సు నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.శ్రీధర్, ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు, తెలుగుశాఖాధిపతి వీవీబీ సంజీవరావు, ఎల్.శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 29: పాతతుంగపాడు గ్రామదేవత శ్రీకనకదుర్గమ్మ విగ్రహ, యంత్ర, శిఖర, త్రిశూల ప్రతిష్ఠ గురువారం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్మశాన వాటికి నిర్మాణానికి భూమిపూజ

బిక్కవోలు, ఫిబ్రవరి 29: ఊలపల్లి పాకలులో నూతనంగా నిర్మించనున్న స్మశాన వాటిక పనులకు గురువారం ఎంపీటీసీ బండారు శివ భూమి పూజ చేశారు. మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి శ్మశాన వాటిక నిర్మాణానికి సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎప్పుడిస్తారో..

- అటు ఆశావహులు, ఇటు పార్టీ కేడర్‌లోనూ టెన్షన్
- ఇంకా టీడీపీలో నాలుగుచోట్ల అదే ఉత్కంఠ
- గోరంట్ల, దుర్గేష్ టికెట్లు ఇంకా అధికారిక ప్రకటించని వైనం
- నిడదవోలు, కొవ్వూరు సీనియర్లలో ఆందోళన
- వైసీపీలో అంతా గజిబిజి వ్యవహారం



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



కందుల దుర్గేష్ (జనసేన)



గోరంట్ల (తెలుగుదేశం)

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మార్చి నెల రెండోవారంలో వచ్చే అవకాశం ఉంది. కానీ ఇప్పటిదాకా ప్రధాన పార్టీలు ఇంకా అభ్యర్థులను పూర్తి స్థాయిలో ఖరారుచేయలేదు. దీంతో ఆశావహులతోపాటు ఆయా ప్రాంతాల కార్యకర్తలు, అభిమానుల్లో కూడా ఆందోళన వెంటాడుతోంది. ఇప్పటివరకూ అధికారికంగా టీడీపీ నుంచి రాజమహేంద్రవరం సిటీ, అనపర్తి స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేయగా, జనసేన నుంచి రాజానగరం అభ్యర్థిని ఖరారుచేసిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు సీట్లకు టీడీపీ -జనసేన పొత్తు ఓ బంధాన్ని ఏర్పాటుచేసింది. రాజమహేంద్రవరం రూరల్ సీటు కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్ ఆశించగా.. గోరంట్లకు ఖాయంచేసి, పొత్తులో భాగంగా దుర్గేష్‌కు నిడదవోలు స్థానం ఖాయంచేసినట్టు ఆయా పార్టీల అధిష్ఠానాలు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ ఇంకా అధికారికంగా ప్రకటించకపోవడంతో వీరిద్దరితోపాటు పార్టీ కేడర్‌లోనూ టెన్షన్ వీడలేదు. నిడదవోలుకు దుర్గేష్ వసున్నారనే సమాచారంతో అక్కడ టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వర్గంలో ఆందోళన మొదలైంది. శేషారావుకే సీటివ్వాలని ఆయన అనుచరులు డిమాండ్ చేస్తున్నారు. అక్కడ టికెట్ ఆశించిన మరో సీనియర్ నేత కుందుల సత్యనారాయణ మాత్రం ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపిస్తామని, చంద్రబాబును సీఎం చేయడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే శేషారావు, కుందుల సత్యనారాయణ కూడా సీనియర్ నేతలే. అక్కడ వారి భవిష్యత్ ఏంటనేది అధిష్ఠానం చెప్పే అవకాశం ఉంది. కానీ ఈలోపు టెన్షన్.. టెన్షన్. ప్రతీ కార్యకర్తలోనూ టెన్షన్ పెరిగిపోతోంది. ఇక కొవ్వూరులో ఇంకా అభ్యర్థి ఎవరనేది తేలలేదు. తనదే టికెట్ అని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ చెబుతుండగా, అక్కడ ఓ ముఖ్యవర్గంతో ఆయనకు అభిప్రాయ బేధాలు ఉండడం వల్ల ఇంకా స్పష్టత లేదు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఓ ముఖ్యవర్గం మద్దతు ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ కూడా నేతల్లో టెన్షన్ ఉండగా.. కార్యకర్తలు, పార్టీ అభిమానుల్లో అయోమయం నెలకొంది. గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు పోటీ చేస్తారని రెండేళ్ల ముందు నుంచే పార్టీ అధినేతతోపాటు, పలువురు పార్టీ సీనియర్లు కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయనకు మొదటి జాబితాలోనే చోటు లభిస్తుందని అందరూ భావించారు. కానీ మొదటి జాబితాలో పేరు లేదు. నల్లజర్లకు చెందిన జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు.. వెంకట్రాజును వ్యతిరేకిస్తున్నారు. ఆయన మొదట ముప్పిడి వెంకటేశ్వరరావుకు మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం మౌనం వహించినట్టు చెబుతున్నారు. సీనియర్‌గా ముప్పిడిని గౌరవిస్తూనే వెంకట్రాజును అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. కానీ ఆలస్యమవుతుండడంతో కేడర్‌లో టెన్షన్ పెరుగుతోంది. ఇప్పటికీ జిల్లాలో పూర్తి స్థాయిలో టికెట్లు రాకపోయినా ప్రచారం జరుగుతోంది. కానీ అధికారికంగా అభ్యర్థిగా ఓటు అడగడం వేరు. దానికోసం అంతా టెన్షన్ పడుతున్నారు.

రాజమహేంద్రవరంలో రసవత్తరం

రాజమహేంద్రవరం రాజకీయం రసవత్తరంగా మారింది. రాజకీయ హీట్ పెరిగింది. ఈసారి అన్ని సామాజిక వర్గాల ఓట్లు ప్రధానంగానే భావిస్తున్నారు. దీంతో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలోకి వలసలు పెరిగాయి. రాజమహేంద్రవరం అర్బన్‌లో సమీకరణాలు వేగవంతంగా మారుతున్నాయి. ఇటీవల ఏపీ అప్పారావు రోడ్డు నుంచి శ్రీరామపురం వెళ్లే దారిలోని ఓ రాజుగారి గెస్ట్‌హౌస్ క్షత్రియ ప్రముఖుల సమావేశం జరిగింది. అర్బన్‌లో టీడీపీకి మద్దతుగా ఉండాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇక ఇటీవల శెట్టిబలిజ వర్గానికి చెందిన బలమైన నేత గుత్తుల నారాయణ, బ్రాహ్మణవర్గానికి చెందిన నిముషకవి, ప్రదీప్‌లతోపాటు పలువురు టీడీపీలో చేరారు. వైసీపీ నేత, ఉమా మార్కేండేయస్వామి దేవస్థానం చైర్మన్ ఇన్నమూరి దీపక్ పార్టీలో చేరుతున్నారు. వైసీపీకి రాజీనామా చేశారు. 25వ డివిజన్‌లోని కాపు వర్గానికి చెందిన ముద్రగడ జయరాం, అర్లపల్లి బాబూరావు నాయకత్వంలో సుమారు 150 మంది చేరారు. తూర్పుకాపు వర్గానికి చెందిన ప్రముఖుడు రుంకాని వెంకటేశ్వరరావు కుమారుడు, అజాద్‌చౌక్‌కు చెందిన యాదవ వర్గానికి చెందిన శేఖర్ తన అనుచరులతో టీడీపీలో చేరారు. సుమారు 50 మంది ముస్లిం నాయకులు కూడా టీడీపీ కండువా కప్పుకున్నారు. 47వ డివిజన్‌కు చెందిన 75 మంది ఎస్సీ నాయకులు కూడా పార్టీలో చేరారు. ఇంకా వివిధ సామాజిక వర్గాలకు చెందిన పలువురు పార్టీలో చేరనున్నట్టు చెబుతున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసుకు నగరంలో ఆదరణ పెరుగుతోంది. తన పర్యటనలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నారు. మరోపక్క జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ కూడా ఆదిరెడ్డికి అండగా నిలిచి ప్రచారం చేస్తున్నారు. నగరంలోని టీడీపీ సీనియర్ నేత, గుడా తొలి చైర్మన్ గన్ని కృష్ణ అండగా నిలిచారు. కాగా టీడీపీ ఎంపీ అభ్యర్థి విషయం ఇంకా తేలలేదు.

వైసీపీలో అంతా అయోమయం!

- నేతల ప్రకటనలతో అభ్యర్థిగా ఉంటామో లేదో తెలియని వైనం
- అధికారిక ప్రకటన వచ్చే వరకూ సమన్వయకర్తలకు టెన్షనే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు స్థానాలకు సమన్వయకర్తలను వైసీపీ ప్రకటించింది. అదీ గజిబిజి వ్యవహారంగానే నలుగుతోంది. గోపాలపురం ఇన్చార్జిగా తానేటి వనిత, కొవ్వూరు ఇన్చార్జిగా తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం సిటీ సమన్వయకర్తగా మార్గాని భరత్‌రామ్, రూరల్ సమన్వయకర్తగా మంత్రి వేణును ప్రకటించారు. కొవ్వూరు నుంచి హోం మంత్రి తానేటి వనితను గోపాలపురం పంపించారు. అక్కడున్న తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు. అయితే తాను కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే గోపాలపురంలో తనకు ఎవరు ఓటేస్తారంటూ హోంమంత్రి తన అంతరంగికుల వద్ద వాపోతుండగా.. కొవ్వూరు తీసుకొచ్చిన గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావులోనూ అదే అసహనం ఉందని చెబుతున్నారు. ఈ పరిణామాలతో వనిత సామాజిక వర్గం నాయకులు అయోమయంలో ఉన్నారు. కొవ్వూరులో వారి ప్రాబల్యం నెమ్మదించిందనే వార్తలు వస్తున్నాయి. అలాగే గోపాలపురంలోనూ తలారి వర్గం ప్రాభవం తగ్గిందని తెలుస్తోంది. రాజానగరం విషయంలో గందరగోళం నడుస్తూనే ఉంది. జక్కంపూడి కుటుంబానికి ఫ్యామిలీ ప్యాకేజీ ఉంటుందా? లేక రాజాను కూడా బదిలీ చేస్తారా? అనే మీమాంశ నడుస్తోంది. జగన్ ఇప్పటి వరకూ విడుదల చేసిన జాబితాల్లో రాజానగరం స్థానంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. డాక్టర్ గూడూరిని ఎంపీ భరత్ తన వ్యూహంలో భాగంగా పార్టీలోకి తీసుకొచ్చారనే వాదన ఉంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నా ముందు నుంచీ భరత్ రాజమహేంద్రవరం సిటీపైనే కన్నేశారు. వాస్తవానికి గూడూరిని పార్టీ కార్యక్రమాల నిర్వహణ ఖర్చుల కోసం తీసుకొచ్చారనే విమర్శలు గతంలో నుంచే పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇప్పుడు గూడూరిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వైసీపీకి ఆర్థికబలం చేకూరిందని కొందరు చెబుతున్నారు. మరోవైపు బలమైన సామాజికవర్గానికి చెంది, పార్టీని నమ్ముకొని ఉన్న డాక్టర్ అనసూరి పద్మలతకు ఆశజూపి మోసం చేశారనే చర్చ పార్టీ వర్గాల్లో నలుగుతోంది. ముందు నుంచీ ప్రజల్లో ఉంటూ ఎంపీ సీటు తనదేనని అనుకొన్న తరుణంలో గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చి ఆ మహిళ కంట నీళ్లు పెట్టించారనే విమర్శలున్నాయి. ఇక వైసీపీ అతి ముఖ్యుల్లో ఒకరైన వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలు ఆ పార్టీ నాయకులను బిత్తరపోయేలా చేశాయి. ఏడు జాబితాలూ మారొచ్చు అనే సంకేతాలను వైవీ సుబ్బారెడ్డి తన వ్యాఖ్యల ద్వారా స్పష్టంచేశారు. "ఇప్పటివరకూ మేం మార్పులు, చేర్పులు చేసినా వాళ్లు 'సమన్వయకర్తలే'.. ఒక్కసారి లిస్ట్ అనౌన్స్ చేశాక తప్పకుండా అభ్యర్థులుగా మారతారు. అప్పటివరకూ ఎవరినైనాసరే సమన్వయకర్తలుగానే నియమించడం జరిగింది. ఫైనల్ లిస్ట్ వచ్చిన తర్వాతే అదే కన్ఫర్మేషన్ అవుతుంది" అంటూ మడమ తిప్పేశారు. దీంతో ఎవరు సీటు కింద నీరు చేరిందో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తేగాని తేలే అవకాశం లేదు. మరోవైపు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలతో కొందరిలో ఆశ మళ్లీ చిగురిస్తోంది. సీటు కోసం మళ్లీ 'ప్రయత్నాలు' మొదలు పెట్టారని తెలుస్తోంది. రాజమహేంద్రవరం రూరల్‌లో చందన నాగేశ్వర్ ముందు నుంచీ వైసీపీలో చురుగ్గా ఉన్నారు. తనకంటూ ఓ కేడర్ ఏర్పాటుచేసుకున్నారు. ఆయనను పక్కన పెట్టేసి వేణును తీసుకొచ్చారు. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. రాజమహేంద్రవరం ఎంపీ సీటు తనదేనని అనసూరి పద్మలత ముందు నుంచీ ఆశ పెట్టుకున్నారు. అయితే పార్టీలో చురుగ్గా తిరుగుతున్న ఆమెను కాదని చివరికి అదే సామాజిక వర్గానికి చెందిన గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చారు. ఎమ్మెల్యేగా లేదా ఎంపీగా పోటీ చేయడానికి అనసూరి పద్మలతను ఒప్పించాల్సిందిగా రెండేళ్ల క్రితమే వైవీ సుబ్బారెడ్డి ఓ ముఖ్య నాయకుడితో చెప్పారని సమాచారం. ఆ విధంగా ఆమెకు వైసీపీ పెద్దలు చుక్కలు చూపించారు. అంతా అనుకున్నట్టే జరుగుతోందని వైసీపీ పెద్దలను నమ్మిన అనసూరికి నిరాశే మిగిలింది. వైసీపీ పెద్దలు చాపకింద నీరులా చేసిన మోసాన్ని తట్టుకోలేక కన్నీరుపెట్టారు. మార్పులు చేర్పుల ప్రకటనతో మరోసారి భంగపడిన వారంతా కొత్త ఆశలతో తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారని తెలుస్తోంది.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 29 : సీఎం జగన్మోహనరెడ్డి రాష్ట్రంలోని లక్షలాదిమంది నిర్మాణ కార్మికుల భవిష్యత్తుకు చెందిన సంక్షేమబోర్డుకు తూట్లు పొడిచారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను దేశవ్యాపితంగా ఒకేవిధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంగా జగన్ వచ్చిన తర్వాత సంక్షేమ బోర్డు నిర్వీర్యమైందని, దీన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ద్వారా అందాల్సిన ప్రభుత్వ ఆర్థిక సాయం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.5 కోట్ల క్లెయిమ్స్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.శ్రీనివాస్, చింతలపూడి సునీల్, తదితరులు పాల్గొన్నారు.




చట్టంతో విభేదించిన బాలలతో మాట్లాడుతున్న ప్రత్యూష

చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష


రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): చెడు స్నేహాల వల్ల అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, జీవితాలు సమస్యల్లో చిక్కుకుంటాయని.. అందువల్ల వాటికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ బాలల పర్యవేక్షణ గృహాన్ని పరిశీలించారు. చట్టంతో విభేదించిన పిల్లలతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. చెడు పనులు చేయకపోయినా అలాంటి పనులు చేసే వాళ్లతో ఉన్నవారికి కూడా ప్రతికూల పరిణామాలు వర్తిస్తాయని హితబోధ చేశారు. ఉచితంగా న్యాయవాది సేవలను పొందడం వారి హక్కు అని తెలిపారు.



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న వెంకటరత్నం స్వామి

ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీగా వెంకటరత్నం బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీగా టి.వెంకటరత్నంస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కాగా.. విజయవాడలోని ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలో నియమితులయ్యారు.





బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో లబ్దిదారుడి పేరుతో తయారుచేసిన పట్టా.. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం సేకరించిన మొత్తం 58 ఎకరాల్లో ఒక రైతుకు చెందిన భూమి

అనపర్తిలో వైసీపీ పట్టాల తాయిలం!

- ఎన్నికల వేళ హడావుడిగా లబ్దిదారులకు పట్టాలు సిద్ధం
- రైతులకు భూసేకరణ సొమ్ము చెల్లించకుండానే పట్టాల తయారీ
- మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ఆందోళనలతో రాత్రికి రాత్రే రైతుల ఖాతాల్లో సొమ్ములు
- ఇంకా బిక్కవోలు మండలం కాపవరంలో ఒక్కపైసా జమ లేదు

అనపర్తి, ఫిబ్రవరి 29: ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు అందించేందుకు భూసేకరణ చేసి ఆయా రైతులకు సొమ్ములు చెల్లించకుండా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా పట్టాల తయారీ ప్రక్రియపై అనపర్తిలో గత నాలుగు రోజులుగా కలకలం రేగుతోంది. అనపర్తి మండలంలోని 11 గ్రామాల లబ్ధిదారుల జాబితాను 2019లో 90 రోజుల వ్యవధిలో ఇళ్ల స్థలాల పథకంలో భాగంగా ఎంపిక చేశారు. ఈ జాబితాలో 5,409 మంది అర్హులను గుర్తించారు. అప్పటికే 2003లో అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి అనపర్తి శివారు కొత్తూరులో భూసేకరణ ద్వారా సేకరించిన 38 ఎకరాల భూమి, లక్ష్మీనరసాపురంలో కొద్ది భూమి అందుబాటులో ఉంది. దీనికితోడు వైసీపీ ప్రభుత్వం దుప్పలపూడి గ్రామంలో 18 ఎకరాల భూమిని సేకరించింది. వీటిలో అర్హుల జాబితాలో ఉన్న 2,350 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మిగిలిన 3,059 మందికి పట్టాలు పంపిణీ చేయలేకపోయారు. దీంతో తమకు ఇంటిస్థలం రాలేదంటూ అధికార పార్టీ నేతలపై ప్రజల నుంచి ఒత్తిడి పెరిగింది. రెండేళ్ల కిందట బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో గ్రాసిమ్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం జగన్‌కి బిక్కవోలు, అనపర్తి మండలాల్లో ఆరు వేల మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉందని, దీనికి సుమారు 200 ఎకరాల భూమి అవసరమని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వివరించగా, అదే వేదికపై ముఖ్య మంత్రి భూసేకరణకు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో భూసేకరణ ప్రక్రియ ప్రారంభించి బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో 58 ఎకరాల భూమిని, అనపర్తి మండలం రామవరం, కుతుకులూరు, పులగుర్త గ్రామాల్లో సుమారు 30 ఎకరాల భూమిని సేకరించి రైతుల నుంచి పత్రాలు తీసుకున్నారు. ఇదంతా జరిగి ఏడాదిన్నర గడిచిపోవడమే కాకుండా ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు కనిపించకుండాపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, రైతుల ఖాతాల్లో సొమ్ములు నేడో రేపో పడిపోతాయంటూ చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు సొమ్ములు చెల్లించకుండానే వారి భూముల సర్వే నెంబర్లతో ప్లాన్ తయారుచేసి పట్టాల తయారీ ప్రక్రియను ప్రారంభించారు. ఇదంతా తహశీల్దార్ కార్యాలయంలో బాహాటంగా జరుగుతుండడంతో అసలు రైతులకు డబ్బులు వస్తాయా లేక ప్రభుత్వం మారితే తమ భవిష్యత్ ఏమిటన్న ప్రశ్నలతో రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గత శనివారం అక్కడకు చేరుకుని డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను నిలదీశారు. రైతులకు సొమ్ములు చెల్లించకుండా ప్రభుత్వం పొజిషన్ తీసుకోకుండా వారి సర్వే నెంబర్లతో పట్టాలు ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. ఇవి డమ్మీ పట్టాలంటూ అక్కడే నేలపై బైఠాయించి నల్లమిల్లి ఆందోళన చేశారు. గత సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ప్రశ్నించడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. తర్వాత రామకృష్ణారెడ్డి నేరుగా వెలగపూడిలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు కూడా డమ్మీ పట్టాల వ్యవహారంపై ఫిర్యాదుచేశారు. అలాగే అనపర్తిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి



పట్టాలతో తహశీల్దార్ కార్యాలయంలో నిరసన దృశ్యం

పట్టాల డమ్మీ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. డమ్మీ పట్టాల తయారీ వ్యవహారంపై తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లిన రామకృష్ణారెడ్డి సహా 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నాలుగైదు రోజులుగా రైతులకు సొమ్ములు చెల్లించకుండా డమ్మీ పట్టాలు తయారు చేస్తున్నారంటూ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేస్తున్న పోరాటానికి ఫలితంగా మొన్న మంగళవారం రాత్రి అనపర్తి మండలంలోని రామవరం, కుతుకులూరు, పులగుర్త గ్రామాలకు చెందిన 53 మంది రైతుల ఖాతాల్లో భూములకు చెందిన సొమ్ములను ప్రభుత్వం జమచేసింది. దీంతో బాధిత రైతులు ఆనందం వ్యక్తంచేశారు. అయితే అనపర్తి లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకు కాపవరంలో సేకరించిన 58 ఎకరాల భూమికి రూపాయి కూడా జమకాకపోవడంతో రైతుల్లో ఆందోళన కొనసాగుతూనే ఉంది.



నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు
- కంట్రోల్ రూం నెం.9492226232

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లూ చేశామని ఇంటర్‌బోర్డు జోన్ 1, 2 ఆర్జేడీ శారద తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయని, ఆలస్యంగా విద్యార్థులకు అనుమతి ఉండదన్నారు. జనరల్ విభాగంలో మొదటి ఏడాది 19,406, రెండో ఏడాది 18,166, ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది కలిపి 3,810 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరశింహం పేర్కొన్నారు. తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయం, నిరంతర విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 52 సెంటర్లకు 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 6 అడిషనల్ డీవోలు, 11 మంది కస్టోడియన్లు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 2 సిటింగ్ స్క్వాడ్స్‌ని నియమించామని చెప్పారు. జిల్లాలో ఒక సున్నితమైన, 600 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్నవి 6 సెంటర్లు ఉన్నాయన్నారు. పరీక్షలకు సంబంధించి సమాచారం కోసం కంట్రోల్ రూం నెంబర్లు 0883 2473430, 9492226232లో సంప్రదించాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని పేర్కొన్నారు.

ఒత్తిడి వద్దు.. ప్రశాంతంగా రాయండి!



జవాబులతోపాటు సమయమూ చాలా ముఖ్యమే

పరీక్షల వేళ ఒత్తిడిని అస్సలు దరిచేయనీయకూడదు. పరీక్షలకు ఇంటి వద్ద నుంచి బయలుదేరడం దగ్గర నుంచీ పరీక్ష రాసి బయటకు వచ్చేవరకూ మానసికంగా భయపడకూడదు. ఒత్తిడి పడడం వల్ల తెలిసిన సమాధానాలను కూడా మరిచిపోయే ప్రమాదం ఉంది. పరీక్ష పత్రం అందుకొన్న తర్వాత ప్రశాంతంగా ఓ ఐదు నిమిషాలు చూసుకొని బాగా సమాధానాలు తెలిసిన ప్రశ్నలతో మొదలుపెట్టాలి. తర్వాత కొంత తెలిసినవి, చివరిలో రావనుకొని వదిలేసిన ప్రశ్నల సమాధానాల కోసం ప్రయత్నించాలి. జవాబులు ఎంత అవసరమో అంతే రాస్తే సమయం కలిసి వస్తుంది. బాగా తెలుసునని రాసుకుంటూపోతే సమయం వృథా అవుతుంది. అందువల్ల సమయాన్ని అంచనా వేసుకుంటూ జవాబులు రాసుకోవాలి. ఈ క్రమంలో జవాబు పత్రాలపై ప్రశ్నల నంబర్లను వేయడంలో జాగ్రత్త వహించాలి. జవాబు పత్రాలపై ఇన్విజిలేటర్ల సూచనలను పాటిస్తూ హాల్ టికెట్ నంబరు తదితరాలు నింపాలి. మరుసటిరోజు పరీక్షలకు అవసరమైన వాటిని.. అంటే స్కేలు, పెన్సిలు, పెన్నులు, దయాగ్రం వేసే వస్తువులు, హాల్ టికెట్‌లను ఒకచోట పెట్టుకుంటే పరీక్షకు బయలుదేరే సమయంలో హైరానా పడాల్సిన అవసరం ఉండదు. పరీక్ష జరుగుతున్న రోజుల్లో సాత్వికాహారం తీసుకోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు ప్రశాంతంగా ఉండే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలి. పరీక్ష రోజుల్లో సరిపడా నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోతే ఆ ప్రభావం పరీక్షపై పడుతుంది. అందువల్ల రివ్యూ చేసుకున్నా సమయానికి నిద్రపోవాలి. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. అంటే 8గంటలకల్లా పరీక్ష కేంద్రం వద్ద ఉండేలా ఇంటి నుంచి బయలుదేరాలి.

● సామాజిక బాధ్యతను గుర్తెరిగి..

పరీక్షలకు బయలుదేరే విద్యార్థులు తారసపడితే.. వారికి అవసరమైతే ఆటోవాలాలు ఇతర వాహనదారులు ఆ విద్యార్థులను పరీక్ష కేంద్రాల వద్దకు చేర్చడం సామాజిక బాధ్యతగా గుర్తెరగాలి. ఒక్కోసారి బస్సులు ఆలస్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అలాంటి వాళ్లను వాహనదారులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు సకాలంలో తీసుకువెళ్లాలి.

ఎన్నికల ఖర్చు విషయంలో మార్గదర్శకాలు పాటించేటట్టు చూడాలి

రాజకీయ పార్టీలు, అభ్యర్థుల మార్గదర్శకాలపై నియమావళిని కచ్చితంగా పాటించాలి

ఎన్నికల వ్యయ పర్యవేక్షణాధికారుల శిక్షణా తరగతుల్లో జేసీ ఎన్.తేజ్‌భరత్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి29(ఆంధ్రజ్యోతి):ఎన్నికల ఖర్చుపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల మార్గదర్శకాలు, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మోడల్ ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించేలా ఎన్నికల వ్యయ పరిశీలకులు బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ స్పష్టంచేశారు. స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం సార్వత్రిక ఎన్నికల నియోజకవర్గ వ్యయ పర్యవేక్షణా అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనావళి అమలు విషయంలో ఎంసీసీ బృందాలు, ఏఈఆర్‌ఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్, వ్యయ పరిశీలకులు, పోలీసు అధికారులు, ఇతర ముఖ్య సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలు లేకుండా ఓటు హక్కును పారదర్శకంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బు వినియోగం మీద బాగా దృష్టి పెట్టాలన్నారు. నగదు లావాదేవీల విషయంలో సహేతుకమైన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. ఆధారాలు లేని డబ్బును ఆదాయ పన్ను చట్టాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల్లో మితిమీరిన అక్రమ ఖర్చులే అవినీతికి మూలకారణమని చెప్పారు. బృందంలో వీడియోగ్రాఫర్ కూడా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సీహెచ్ భరద్వాజ శ్రీనివాస్, ఎ.నాగేశ్వరరావు, ఎ.ఉషాశ్రీ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది: ద్విసభ్య కమిటీ



కొవ్వూరు, ఫిబ్రవరి 29: తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ఎన్నికల శంఖారావం సభ చూసి తాడేపల్లి ప్యాలస్ దద్దరిల్లిందని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమన్నారు. రాష్ట్రాన్ని దోచుకుంటున్న వైసీపీ దొంగలకు వ్యతిరేఖంగా టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా పోరాడుతున్నాయని, రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తుతో చేతులు కలిపాయన్నారు.

భవన నిర్మాణ కార్మికుల దీక్షలు

కొవ్వూరు, ఫిబ్రవరి 29: మెమో-1214ను రద్దుచేసి సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు పథకాలను సమర్థవంతంగా అమలుపర్చాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దుకూరి దొరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు గురువారం కొనసాగాయి. దొరయ్య మాట్లాడుతూ సీఎం జగన్ నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలోను, సంక్షేమబోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. దీక్షలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధం బాబ్జి, గెడ్డం సాయిబాబా, బొనిగే రాంబాబు, జనసేన నాయకుడు మారిశెట్టి వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యు.కేదార్, డి.సత్తిబాబు, ఎస్.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, జొన్నల రాంబాబు పాల్గొన్నారు.

దేవరపల్లి సీఐగా బాలసురేష్‌బాబు



సీఐకు మొక్కను అందజేస్తున్న ఎస్ఐ శ్రీహరిరావు

దేవరపల్లి, ఫిబ్రవరి 29: దేవరపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాలసురేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఏలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై దేవరపల్లి వచ్చారు. ఈయన గతంలో సీఐడీ సీఐగా కుక్కునూరు, జంగారెడ్డిగూడెం సీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్ఐ శ్రీహరిరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి

గోపాలపురం, ఫిబ్రవరి 29: ఈ నెల 1వ తేదీ నుంచి 1 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ జనరల్, ఒకేషనల్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. 2023 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో ఇంటర్‌కి మొదటి సంవత్సరానికి 600మంది, ద్వితీయ సంవత్సరానికి 400 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఒక్కొక్క గదిలో 30మంది చొప్పున 20గదులు కేటాయించామన్నారు. తరగతి గదులోన్ల విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌గా తనను, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా సీవీవీ సాంబశివరావు, వెంకట్రాజులను నియమించారన్నారు. అలాగే స్థానిక శ్రీగౌతమి జూనియర్ కాలేజీలో మొత్తం 495మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటిరోజు జరిగే పరీక్షకు 395 మంది హాజరవుతారన్నారు. 13 గదులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టిక్కెట్లతో అర్ధగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరాలని చీఫ్ సూపరింటెండెంట్ రమణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసరు దుర్గారావు చెప్పారు.

హరేరామ పదవీ విరమణ సభ



సభలో ప్రసంగిస్తున్న ఆర్ఎం ఆదిశేషయ్య

దేవరపల్లి, ఫిబ్రవరి 29: ఉద్యోగ నిర్వహణలో వారి చేసిన పనులే ఎప్పటికి గుర్తుండిపోతాయని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు ఆర్ఎం ఆదిశేషయ్య అన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం పొగాకు బోర్డు ఫీల్డ్ ఆఫీసర్‌గా కారుమంచి హరేరామ పదవీవిరమణ వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా ఆదిశేషయ్య మాట్లాడుతూ ఇటు పొగాకు బోర్డు ఫీల్డ్ ఆఫీసర్‌గా ఆయన సేవలను కొనియాడారు. అనంతరం హరేరామను పొగాకుబోర్డు అధికారులు, సిబ్బంది, రైతులు సత్కరించారు. కార్యక్రమంలో దేవరపల్లి ఏఎస్‌జీఎల్‌కే ప్రసాద్, ఐటీసీ కంపెనీ ప్రతినిధి కొట్రెడ్, పీఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి రఘు, రైతులు యాగంటి సాయిబాబు, యాగంటి వెంకటేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ, కాట్రు భీమరాజు పాల్గొన్నారు.

సరిపల్లి రమణ 93వ సారి రక్తదానం

నిడదవోలు, ఫిబ్రవరి 29: నిడదవోలులో గురువారం జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దాత సరిపల్లి రమణ 93వ సారి రక్తదానం చేశారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం



దొండపూడిలో ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపురం, ఫిబ్రవరి 29: ఆపన్నులను ఆదుకోవడానికి ప్రతిఒక్కరు స్వచ్ఛందంగా ముందు రావాలని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. దొండపూడిలో ఎంపీపీ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి గొన్నూరి అజిత్ ఊపిరితిత్తులు, లీవర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులతో పాటు శ్రీకాకుళంకు చెందిన ఆజాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయంతో సమకూర్చిన రూ.1,55,600 అజిత్ కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఎంఈవో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ రాజేష్, హెచ్ఎం భైరవస్వామి, నూతంగి శ్రీనివాస్, సీఆర్పీ కొయ్య నాగరాజు, సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



నల్లజర, ఫిబ్రవరి 29: నల్లజర్ల మండలం అనంతపల్లిలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటకు చెందిన చవల కృష్ణమూర్తి మృతి చెందినట్టు ఏఎస్ఐ మోహన్‌రావు తెలిపారు. వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న కృష్ణమూర్తి తమ కుమార్తె ఇంటికి దేవరపల్లి వెళ్తుండగా అనంతపల్లి వద్ద టోల్‌ప్లాజా వద్ద వెనుక ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ డాక్టర్ మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 29: రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న డాక్టర్ మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కడప జిల్లా మైదుకూరు మండలం లెక్కల వారి పల్లి గ్రామానికి చెందిన అంకిరెడ్డిపల్లి కొండారెడ్డి(37) రాజమహేంద్రవరం బొల్లినేని(కిమ్స్) ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. గత నెల 25వ తేదీ రాత్రి నైట్ డ్యూటీ ముగించుకుని 26వ తేదీ ఉదయం బైక్‌పై దేవరపల్లిలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. గామన్‌బ్రిడ్జి 1వ స్తంభం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 29: విద్యార్థులు బ్యాంకింగ్ వ్యవస్థ అందిస్తున్న సేవలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు మొదలైన సేవలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో గురువారం జరిగిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాటాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ఉద్యమం చేపట్టాలని, ఈ వయస్సు నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా

కొవ్వూరు, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గురువారం సాయంత్రం 4గంటల నుంచి 5:30ల వరకు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణరాజు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవకు అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీడీ రావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ జూలై 2023 నుంచి అమలు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏలు, పీఎఫ్, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లుల బకాయిలు విడుదల చేయాలి. ఉపాధ్యాయుల నియామకాలను రెగ్యులర్ టైమ్‌స్కేల్‌లో నియమించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, డ్రాప్ అవుట్స్ పెరుగుతున్నారని, గతంలో మాదిరిగా ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ సుభాకర్, వి.విష్ణు, ఎస్కే సలీమ్, అనితాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పనులకు రాకపోయినా మస్తర్లు

- ఐదు రోజుల పనికి ఆరు రోజుల పేమెంట్
- ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు
- నల్లజర్లలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక



ప్రజా వేదికలో నివేదిక వివరిస్తున్న తనిఖీ బృందం

నల్లజర్ల, ఫిబ్రవరి 29: నల్లజర్ల మండలంలో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్టు స్వయంగా డీఆర్పీలే డ్వామా పీడీ ముందు నివేదికను చదివి వినిపించారు. గురువారం నల్లజర్ల ఉపాధి హామీ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. నల్లజర్ల మండలంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి చేపట్టిన 731 పనులకు రూ.8,90,82,000 ఖర్చు చేశారు. ఇందులో వేతనదారులకు రూ.7,89,52,000 కాగా మెటీరియల్ కాంపోనెట్‌గా రూ.1,01,15,000 ఖర్చు చేశారు. దీనిపై ఈ నెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు గ్రామస్థాయిలో సామాజిక తనిఖీ బృందం 15వ విడత ఆడిట్ నిర్వహించి గ్రామ సభలు జరిపారు. వివిధ గ్రామాల్లో మస్టార్ షీట్లపై సంతకాలు లేకుండానే పేమెంట్లు చేశారని డీఆర్పీలు డ్వామా పీడీ ముఖలింగంకు వివరించారు. గ్రామంలో ఉన్న చెరువును ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నట్టు చూపారన్నారు. ఐదు రోజుల పనికి ఆరు రోజుల పేమెంట్ చేయడం, వేతనదారులు పనికి రాకున్నా మస్తర్లు వేయడం, తర్వాత కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉన్నట్టు గుర్తించి పీడీకి చెప్పారు. అలాగే తూర్పు చోడవరంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేసిన సచివాలయం, ఆర్బీకే నిర్మాణ పనులకు సంబంధించి ఈ-ఆడిట్, ఎంబుక్ ఇవ్వలేదన్నారు. దీనిపై పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇష్టారాజ్యంగా ప్రజాధనం ఖర్చు చేయడం తగదన్నారు. ప్రతి పని జవాబుదారీగా ఉండాని పేర్కొన్నారు. అవకవతకలు పాల్పడిన వారి నుంచి ప్రభుత్వ సొమ్ములను రికవరీ చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ తులసీ నాయక్, ట్రైనీ సబ్‌కలెక్టర్ సువర్ణ, ఎంపీడీవో నరేష్‌కుమార్, ఏపీడీ అప్పాలరాజు, ఏపీవో రమణ పాల్గొన్నారు.

జెండా సభతో దద్దరిల్లిన తాడేపల్లి ప్యాలెస్

- టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 29: తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ-జనసేన రాజమహేంద్రవరం ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు కోట్ల ప్రజల భవిష్యత్ కోసం రెండు పార్టీలు కలిసాయని, రాష్ట్ర పునఃనిర్మాణానికి ప్రజలందరు చేతులు కలపాలని కోరారు. జగన్ పాలనంతా అరాచకమేనని, చంద్రబాబు సంక్షేమాన్ని అందిస్తే జగన్ వాటిని నిలుపుదల చేసి పేదల బతుకులు నాశనం చేశాడన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో టీడీపీ-జనసేన దూసుకుపోతుందని అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పులివెందులలో జగన్‌కు ఓటమి తప్పదన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు

వైసీపీ పాలనకు మంగళం పాడుదాం

రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనకు మంగళం పాడేందుకు ప్రతిఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఆదిరెడ్డి వాసు పిలుపునిచ్చారు. స్థానిక 48వ డివిజన్‌లో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి పర్యవేక్షణలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్‌తో కలిసి వాసు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే మేజర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ -జనసేన కూటమిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కానేటి ప్రభుదాసు, కానేటి కృపామణి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసును అఖండ మెజార్టీతో గెలిపిస్తాం

వెలమ సంఘం నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 29: రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదిరెడ్డి వాసును అందరి సహకారంతో అఖండ మెజార్టీతో గెలిపిస్తామని కొప్పు వెలమ సంఘం నేత వాసిరెడ్డి రాంబాబు, అధ్యక్షుడు కిలపర్తి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు కొల్లి బుజ్జి, ఉద్యోగ యూనియన్ అధ్యక్షుడు వేమిరెడ్డి సత్యనారాయణ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెలమ సంఘీయులను టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గుర్తించి సీటు ఖరారు చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. ఆదిరెడ్డి కుటుంబం రాజకీయ కుటుంబంగా నిరంతరం ప్రజల మధ్య వుంటూ అనేక సమస్యలపై పోరాడుతోందన్నారు. రాజమహేంద్రవరంలో కొప్పువెలమలు 6వేల మందే ఉన్నారని ఒక చోటా నాయకుడు అంటున్నాడని, అతనికి తెలియదేమో నగరంలో తాము 25వేల పైబడి ఉన్నామన్నారు. సమావేశంలో సప్పా వెంకటరమణ, చల్లా బాలమురళీ, సప్పా ఉమానాగేశ్వరరావు, దొగ్గా వేణు, తెంటు సత్యనారాయణ పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధి

హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి, ఫిబ్రవరి 29: వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధి లాంటి వారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం వలంటీర్ల సత్కార కార్యక్రమం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగింది. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు దోహదపడుతున్నాయని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లను వజ్ర మిత్ర సేవారత్న అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, వైసీపీ కన్వీనర్ సతీష్, వైసీపీ నేతలు కుసులూరి సతీష్, గ్రామ సర్పంచ్ కడిమి వీరకుమారి, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

తాళ్లపూడి: తాళ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైసీపీ నాయకుడు గూడూరి శ్రీనివాసరావు విచ్చేసి మాట్లాడారు. వైసీపీ పాలనలో నాయకుల కంటే ఎక్కువ ప్రాధాన్యం వలంటీర్లకే ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 210 మంది వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ కోదాటి కనకం, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చాగల్లు: వలంటీర్లు వైసీపీ ప్రభుత్వం తిరిగి విజయం సాధింపు లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. గురువారం నెలటూరు శ్రీసీతారామ కళ్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ వలంటీర్లు సేవలను ప్రశంసించారు. అయితే ఈ సందర్భంగా వలంటీర్లు వైసీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు అనుకూలంగా నినాదాలు చేయించారు. జగన్ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పించారు. కార్యక్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

మృతుడు మొగల్తూరు మండలం కొత్తోట వాసి

గోపాలపురం, ఫిబ్రవరి 29: గోపాలపురం శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన ఏనుగు అంజిబాబు(30) బైక్‌పై తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ-జనసేన బహిరంగ సభకు వెళ్లి, అనంతరం కోయలగూడెంలో ఉన్న అతని స్నేహితుని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో గోపాలపురం శివారులో హెచ్‌బీ పెట్రోల్ బంకు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడి తలకు పెద్దగాయమై అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి తండ్రి ఏగును చక్రపాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

దేవాలయాలు, ఆశ్రమాలకు బియ్యం పంపిణీ



నిడదవోలులో బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

కొవ్వూరు/నిడదవోలు, ఫిబ్రవరి 29: కొవ్వూరులో అన్నదానం చేస్తున్న దేవాలయాలు, ఆశ్రమాలకు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేసినట్టు క్లబ్ అధ్యక్షుడు దేవతు కృష్ణప్రసాద్ తెలిపారు. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక సత్యవతినగర్ రక్షక గణపతి మందిరం, వేంకటేశ్వరస్వామి, గోష్పాదేశ్వరస్వామి, రావణబ్రహ్మ ఆలయాలకు, మదర్ థెరిస్సా వీధి బాలల పాఠశాల, వాత్సల్య వృద్ధాశ్రమానికి అన్నదాన నిమిత్తం బియ్యం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వలివేటి ప్రసాద్, మద్దుల సత్యనారాయణ, పలుకూరి రామారావు, రాఘవ రామాకాంత్, సత్యవరపు గురునాథ్, కొత్త సురేష్‌కుమార్, పెరుమాళ్ళ వీరేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే నిడదవోలులో పరిధిలోని కోట సత్తెమ్మ దేవాలయం, సాయిబాబా ఆలయం, సత్యసాయి నిత్యాన్నదాన సేవా ట్రస్ట్‌కు, అనాథాశ్రమాలకు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు బీవీవీ లక్ష్మణరావు, ఉప్పల సతీష్, కేతారిశెట్టి సత్యనారాయణ, మానేపల్లి నానాజీ, కొనిజేటి సురేష్ కుమార్, కొండా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 29: గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరు మండలం వాడపల్లిలో గోదావరి నది ఒడ్డున గురువారం గుర్తుతెలియని మృతదేహం తేలుతుందని సమాచారం రావడంతో సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసునమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

అవినీతి అధికారికి మూడేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారికి కోర్టు జైలు శిక్ష విధించింది. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల్లోని రేషన్ దుకాణాలకు మండపేట నుంచి నిత్యావసర వస్తువులు సరఫరా చేయడానికి వర్క్ ఆర్డర్ కోసం తన కుమారుడిని కాకినాడలోని పౌరసరఫరాల శాఖలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ముడుగు జాన్‌కెన్నడి రాజ్‌కుమార్ లంచం అడుగుతున్నారని పెనికేరుకు చెందిన వైట్ల వెంకట్రావు ఫిర్యాదు చేశారు. 2016 సెప్టెంబరు 23న వెంకట్రావు వద్ద నుంచి రాజ్‌కుమార్ రూ.20వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరంలోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు నేరస్తుడికి గురువారం మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి.శేషయ్య, ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు.

రిటైర్డ్ పోలీసు ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగిని సత్కరిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు ఉద్యోగులను ఎస్పీ జగదీశ్ సత్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏ-సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జీవీ రమణమూర్తి, సాయుధ రిజర్వు విభాగంలో పనిచేస్తున్న ఐ.వెంకట్రావు(ఏఆర్‌హెచ్‌సీ 3090) ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్కార సభలో ఎస్పీ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌కి వారు చేసిన సేవలను ప్రశంసించారు. ఉద్యోగ విరమణానంతర జీవితం ప్రశాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఎలాంటి అవసరం ఉన్నా స్వయంగా వచ్చి తనకు చెప్పవచ్చని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనీల్ కుమార్(శాంతిభద్రతలు), టి.సర్కార్(క్రైమ్స్), ఎల్.చెంచిరెడ్డి (ఏఆర్), డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

సెమీకండక్టర్ చిప్స్‌పై విస్తృత పరిశోధనలు జరగాలి

రాజానగరం, ఫిబ్రవరి 29: భారతదేశంలోని సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ నగరాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మెమ్స్, సెమీకండక్టర్ చిప్స్‌పై విస్తృత పరిశోధనలు జరిగాలని బెంగుళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ సెమీ కండక్టర్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్(ఏ యూనిట్ ఆఫ్ సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ రీసెర్చ్)సితార్ డైరెక్టర్ ఎం.రవి అన్నారు. గైట్ కళాశాలలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మెమ్స్ ఫ్యాబ్రికేషన్ ఎట్ సాక్ అనే అంశంపై అధ్యాపకులకు గురువారం నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాపులో ఆయన రీసోర్స్‌పర్సన్‌గా హాజరై మాట్లాడారు. తమ సంస్థ కార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం గైట్‌లో పరిశోధనాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని గైట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆర్ఎస్ రాజు కోరారు. కార్యక్రమంలో భాగంగా సితార్ డైరెక్టర్ రవిని కళాశాల తరఫున సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ఆర్ఎస్ రావు, హెచ్‌వోడీ బి.శ్రీనివాసరాజా, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తటవర్తి గురుకులంతో 'ఆర్ట్స్' ఒప్పందం



అవగాహన పత్రాలు ఇచ్చిపుచ్చుకుంటున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 29: భారతీయ కళల ప్రచారంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆస్ట్రేలియా కేంద్రంగా సేవలందిస్తున్న తటవర్తి గురుకులం అనే విద్యాసంస్థతో అంతర్జాతీయ ఒప్పందం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు గురువారం తటవర్తి గురుకులం తరఫున అష్టావధాని తటవర్తి శ్రీకల్యాణ చక్రవర్తి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఒప్పంద పత్రాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా అవధాన కళా పరిచయం అనే సర్టిఫికెట్ కోర్సును కళాశాల లలిత కళల విభాగం త్వరలో ప్రారంభిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న వారందరికీ ఈ కోర్సుచేసే అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో లలిత కళల విభాగాధిపతి కస్తూరి సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో బీజేపీ పోరుయాత్ర

సీతానగరం, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన ఆహారం ఇవ్వడంలేదని, డీజిల్, కరెంట్ బిల్లులు ఏడు సార్లు పెంచారని, పెట్రోల్, నిత్యావసరా ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, విద్యుత్ బిల్లులు చూస్తుంటే షాక్ కొడుతోందని బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరి అన్నారు. గురువారం బీజేపీ పోరుయాత్రలో భాగంగా సీనియర్ నాయకుడు ఏపీఆర్ చౌదరితో కలసి ఆయన సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ కేంద్రాలు కేంద్ర నిధులతో ఏర్పాటుచేసుకుని కనీసం నరేంద్రమోదీ ఫొటో లేకుండా వైపీసీ రంగులు, జగన్ ఫొటోలు వాడుకుంటున్నారన్నారు. కేంద్రం జారీ చేసిన ఆయుష్మాన్‌భవ కార్డులను గ్రామవలంటీర్లు వైసీపీ వారికే పంచి మిగిలిన వారికి ఇవ్వలేదన్నారు. అనుమతులు లేని మునికూడలి ఇసుకర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్నారని, అధికారులు అమ్ముకుంటున్నారా, నాయకులు అమ్ముకుంటున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉండవల్లి సాయి, బాలయోగి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలి'

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 29: విద్యార్థులు బ్యాంకింగ్ వ్యవస్థ అందిస్తున్న సేవలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు మొదలైన సేవలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో గురువారం జరిగిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ఉద్యమం చేపట్టాలని, ఈ వయస్సు నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.శ్రీధర్, ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు, తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు, ఎల్.శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో కలెక్టర్ క్షేత్రస్థాయి సమీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 29: జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలతో సమీక్షలు న్విహించారు. ఓటర్లలో చైతన్యం తీసుకురావడం, వాస్తవ పరిస్థితులు అధ్యాయనం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించామన్నారు. రాజమహేంద్రవరం రూరల్, అర్బన్‌లో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడారు. 2019 ఎన్నికలలో ఎంత ఓటింగ్ శాతం నమోదైందో.. ఇప్పుడు ఇంకా ఓటింగ్ శాతం పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో పలు సూచనలు చేశారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట రూరల్ ఆర్వో, తహశీల్దార్ వైకేవీ అప్పారావు, డీటీ ఎంకే సుధీర్, బీఎల్‌వోలు ఉన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 29: జిల్లాలో మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీల పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లోనూ అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ వ్యాక్సిన్ వేసేలా లక్ష్యంగా నిర్ణయించామని, ఈ మేరకు పోలియో వ్యాక్సిన్ సిద్ధం చేశామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ వినూత్న, డాక్టర్ సత్యకుమార్, డాక్టర్ అభిషేక్ మౌనిక, చైతన్య పాల్గొన్నారు.